# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :248 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 08-12-2024 | పేజీలు:4 వెల: 2.00


## భూదాన్ పోచంపల్లి రోడ్డు ప్రమాదం

భువనగిరి, డిసెంబర్7: చెరువులోకి కారు దూసుకెళ్లడంతో ఐదుగురు యువకులు మృతి చెందిన సంఘటన భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. మరొకరు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికి తీశారు. మృతులను వంశీగౌడ్, దినేశ్, హర్ష, బాలు, వినయ్‌గౌడ్‌గా గుర్తించారు. వారంతా 22 నుంచి 25 ఏండ్ల మధ్య వయస్కులేనని వెల్లడించా రు. ప్రమాద సమయంలో కారులో ఆరుగురు ఉన్నారని తెలిపారు. మణికంఠ అనే యువకుడు క్షేమంగా ఉన్నాడని పేర్కొన్నారు. వారంతా హైదరాబాద్ హయత్‌నగర్ ఆర్టీసీ కాలనీకి చెందినవారని తెలిపారు. ఎల్బీనగర్ నుంచి పోచంపల్లి వెళ్తుండగా జలాల్‌పూర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు వద్ద అదుపుతప్పిన కారు చెరువులోకి దూసుకెళ్లిందన్నారు. మృతదేహాలను భువనగిరి దవాఖానకు తరలించారు. వంశి డ్రైవింగ్ చేస్తున్నాడని, ఉదయం 4.30 గంటలకు ప్రమాదం జరిగిందని మణికంఠ వెల్లడించారు. ప్రమాద సమయంలో కారు వేగంగా ఉందని, కారు రెండు పల్టీలు కొట్టి చెరువులో పడిందన్నారు.

# ఘనంగా ప్రజా పాలన – ప్రజా విజయోత్సవాల ముగింపు వేడుకలు

హైదరాబాద్ డిసెంబర్ 6: ప్రజాపాలన ప్రజా విజవా విజయోత్సవాల ముగింపు వేడుకలను డిసెంబర్ 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ వేడుకలలో ప్రజలు కూడా పాలుపంచుకుని సంబరాలు జరుపుకునే విధంగా కార్యక్రమాల రూపకల్పన చేశారు . ట్యాంక్ బంద్ నెక్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వేదికగా పలు సంగీత సాంస్కృతిక వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు, ప్రముఖ సంగీత కళాకారులు వందేమాతరం శ్రీనివాస్, రాహుల్ సిప్లిగంజ్ తమన్ ల సంగీత కచేరీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. సందర్శకుల కోసం సాంస్కృతిక, ఫుడ్, హస్తకళల స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ మార్క్ వద్ద బాణాసంచా ప్రదర్శన, ట్యాంక్ బండ్ వద్ద డ్రోన్ షో, భారత వాయుదళం చే ఎయిర్ షో ఆహుతులను ఆకట్టుకోనున్నాయి. పూర్తి కార్యక్రమాల వివరాలు తేదీల వారిగా ఈ క్రింది విధంగా ఉన్నాయి.

**'ప్రజాపాలన - ప్రజావిజయోత్సవాలు' వేడుకలు**

**(నెక్లెస్ రోడ్, HMDA గ్రౌండ్స్)**

| క్రమ సంఖ్య | తేదీ /సమయం | కార్యక్రమం | వేదిక |
|---|---|---|---|
| 1. | 07.12.2024 | 1.సాంస్కృతిక కార్యక్రమాలు - మూడు వేదికలు (5 - 9PM) | నెక్లెస్ రోడ్ |
| | | 2.సంగీత కచేరీ - శ్రీ వందేమాతరం శ్రీనివాస్ (7 - 8.30 PM) | HMDA గ్రౌండ్స్ IMAX |
| | | 3.ఫుడ్ స్టాల్స్, హ్యాండీక్రాఫ్ట్ స్టాల్స్, కల్చరల్ స్టాల్స్ | ఉదయం - రాత్రి వరకు |
| | | నగరంలో వీధి దీపాల (GHMC ప్రాంతం) అలంకరణ | రాత్రి సమయం |
| 2. | 08.12.2024 | 1.ఎయిర్ షో | ట్యాంక్ బండ్ వద్ద |
| | | 2.సంగీత కచేరీ - శ్రీ రాహుల్ సిప్లిగంజ్ (7PM to 8.30 PM) | HMDA గ్రౌండ్స్ IMAX |
| | | 3.సాంస్కృతిక కార్యక్రమాలు – (5 PM to 9 PM) | 3 వేదికలు - నెక్లెస్ రోడ్ |
| | | 4.ఫుడ్ స్టాల్స్, హ్యాండీక్రాఫ్ట్ స్టాల్స్, కల్చరల్ స్టాల్స్ | ఉదయం - రాత్రి వరకు |
| | | 5.నగరంలో వీధి దీపాల (GHMC ప్రాంతం) అలంకరణ | రాత్రి సమయం |
| 3. | 09.12.2024 | 1.తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ (5.00 PM) | సచివాలయంలో |
| | | 2.బహిరంగ సభ – గౌరవ ముఖ్యమంత్రి (5PM to 5.45PM) | సచివాలయంలో |
| | | 3. డ్రోన్ షో (5.45 PM to 6 PM) | |
| | | 4. బాణసంచా (6.05 PM to 6.20 PM) | |
| | | 5. గౌరవ ముఖ్యమంత్రి - కల్చరల్ వేదికకు చేరుకుంటారు. (6.10 PM) | |
| | | 6. సంగీత కచేరీ - శ్రీ ఎస్ తమన్ (7 PM to 8.30 PM | HMDA గ్రౌండ్స్ IMAX |
| | | 7. సాంస్కృతిక కార్యక్రమాలు – (5 PM to 9 PM) | |
| | | 8. ఫుడ్ స్టాల్స్, హ్యాండీక్రాఫ్ట్ స్టాల్స్, కల్చరల్ స్టాల్స్ | ఉదయం - రాత్రి వరకు |
| | | 9. నగరంలో వీధి దీపాల (GHMC ప్రాంతం) అలంకరణ | రాత్రి సమయం |



## సంపాదకీయం

ఆదివారం 08-12-2024

# తెరవెనుక దోపిడీ.. తెరముందు గారడీ!

దేశంలో కష్టపడే ప్రజలున్నారు. రోజురోజుకు సంపద పెరుగుతూనే ఉన్నది. కానీ, ఆ పెరిగిన సంపద కొంతమంది చేతుల్లోకి చేరిపోతున్నది. పాలకులు తమ ఆశ్రిత పెట్టుబడిదారులకు ప్రజల ఆస్తులను, ప్రకృతి సంపదను దోచిపెడుతున్నారు. పెట్టుబడిదారుల నష్టాలను సోషలైజ్ చేస్తూ, వారి లాభాలను మాత్రం ప్రైవేటైజ్ చేస్తున్నారు. అందుకు ఉదాహరణే దేశంలో పేరుమోసిన ఆశ్రిత పెట్టుబడిదారుడు గౌతమ్ అదానీ. అధికార పీఠాలపై ఆసీనులైన వాళ్ల అండదండలతో వ్యాపార సామ్రాజ్యాన్ని అదానీ విస్తరించిన తీరును చూస్తుంటే ప్రజలు కట్టబెట్టిన అధికారాన్ని పాలకులు ఎంత బహిరంగంగా హేళన చేస్తున్నారో అర్థమవుతున్నది. ప్రభుత్వ పెద్దలను మచ్చిక చేసుకోవడం, కీలక వ్యక్తులకు లంచాలు కుమ్మరించడం ప్రభుత్వాల అండదండలతో సంపద పెంచుకోవడం.. ఇదీ అదానీ వ్యాపార సూత్రం.మన దేశంలోనే కాదు, విదేశాల్లోనూ అదానీ వ్యాపారాలపై ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. భారత ప్రధాని మోదీ ఒత్తిడి మేరకే విద్యుత్ ప్రాజెక్టును కట్టబెట్టాల్సి వచ్చిందని స్వయంగా శ్రీలంక విద్యుత్ శాఖ ప్రతినిధులు ఆ దేశ పార్లమెంట్‌లో ప్రకటించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయితే, ఇలా పెద్దల అండదండలతో దూసుకుపోతున్న అదానీ అమెరికాలో మాత్రం చతికిలపడ్డాడు. అమెరికాలో పెట్టుబడిదారుల నుంచి సేకరించిన డబ్బును భారత్‌లోని పలు రాష్ట్ర ప్రభుత్వాల ముఖ్యులకు లంచాలుగా ఇచ్చారని అగ్రరాజ్యం తాజాగా ఓ కేసు నమోదు చేసింది. అంతేకాదు, అరెస్టుకు వారంట్ కూడా జారీ చేసింది. దీంతో కెన్యా వెంటనే అదానీతో ఉన్న ఒప్పందాలను రద్దు చేసుకున్నది. ప్రధాన విమానాశ్రయ అభివృద్ధి, 30 ఏండ్ల నిర్వహణ కోసం రూ.15,631 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు కెన్యా ప్రభుత్వం అదానీతో గతంలో ఒప్పందం చేసుకున్నది. అలాగే పవర్ లైన్ల నిర్మాణానికి రూ.6,218 కోట్లతో అగ్రిమెంట్ కుదుర్చుకున్నది. ఎప్పుడైతే అమెరికా కేసు నమోదు చేసిందో ఆ వెంటనే ఈ రెండు ఒప్పందాలను రద్దు చేసుకున్నట్టు కెన్యా అధ్యక్షుడు రూటో తేల్చిచెప్పారు. టీఆర్ఎస్, బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందిన తర్వాత కేసీఆర్ 2023 ఫిబ్రవరిలో నాందేడ్‌లో తొలి బహిరంగ సభ నిర్వహించారు. ఆ సభ అనంతరం నేషనల్ మీడియాతో మాట్లాడిన కేసీఆర్ బీజేపీ, అదానీ స్నేహాన్ని ఎండగట్టారు. 'అదానీ కంపెనీలో ఎల్ఐసీ రూ.80 వేల కోట్ల పెట్టుబడి పెట్టడం సరికాదు. ప్రపంచంలోనే అతిపెద్ద బీమా కంపెనీ అయిన ఎల్ఐసీ వ్యవహారంలో కేంద్రం ఎందుకు జోక్యం చేసుకుంటున్నది? అదానీ అవినీతిపై కేంద్రం జాయింట్ పార్లమెంటరీ కమిటీ-జేపీసీ ఏర్పాటు చేయాలి' అని డిమాండ్ చేశారు.ఇలా అంతర్జాతీయంగా అవినీతి ముద్ర వేసుకున్న అదానీని అటు భారత్‌లో, ఇటు మన తెలంగాణలో నెత్తికెత్తుకోవడానికి కారణాలేమిటో ఏలికలకే తెలియాలి. అదానీ అరెస్టుకు అమెరికా కోర్టు వారంట్ జారీ చేయడంతో భారత్‌లో అంటకాగినవాళ్లంతా ఉలిక్కిపడ్డారు. ఇక తెలంగాణ విషయానికి వస్తే ప్రతిపాదిత స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల చందాను తీసుకోవడానికి సిద్ధంగా లేమంటూ సీఎం రేవంత్‌రెడ్డి వెనుకడుగు వేశారు. కానీ, అదానీతో చేసుకున్న ఒప్పందాలపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా పూణెలో పర్యటించిన రేవంత్ మోదీ, అదానీ కలిసి దోపిడీకి ప్లాన్ చేశారని, మరాఠీలు ఆదమరిస్తే ఆర్థిక రాజధాని ముంబై ఆగమైతుందని విమర్శించారు. మహారాష్ట్రలో దోపిడీ కోసం పెట్టుబడులు పెట్టే అదానీ.. రేవంత్‌రెడ్డితో చేసుకునే ఒప్పందాల ద్వారా తెలంగాణను ఉద్ధరిస్తారా అనే విషయమై ఆయనే సెలవియ్యాలి. ఇక్కడ విషయం రూ.100 కోట్ల చందాకు సంబంధించినది మాత్రమే కాదు, దావోస్‌లో అదానీ కంపెనీలతో రేవంత్‌రెడ్డి చేసుకున్న పెట్టుబడుల ఒప్పందాలు, నల్గొండ జిల్లాలో అదానీకి చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. రేవంత్ పరిభాషలో చెప్పాలంటే దోపిడీదారుడైన అదానీతో ఆయన చేసుకున్న ఒప్పందాలు పారదర్శకంగా జరిగాయని ప్రజలు ఎలా నమ్మాలి?అదానీ కంపెనీ నుంచి బొగ్గు కొనుగోళు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం ఒత్తిడి చేసిన సంగతి తెలిసిందే. కానీ, ఈ ప్రతిపాదనను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యతిరేకించారు. 'కోల్ ఇండియా మైనింగ్ కంటే సింగరేణి గొప్పగా పనిచేస్తున్నది. ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించే లక్ష్యంతో సింగరేణిని కాపాడుకుంటాం. టీఎస్‌జెన్‌కో ఆధ్వర్యంలోనే బొగ్గు ఉత్పత్తిని కొనసాగిస్తాం. దేశంలో రూ.3 వేల నుంచి రూ.4 వేలకు టన్ను బొగ్గు లభ్యమౌతున్నప్పుడు అదానీ కంపెనీకి చెందిన ఆస్ట్రేలియా బొగ్గును టన్నుకు రూ.30 వేల నుంచి 40 వేలు వెచ్చించి కొనాల్సిన అవసరం ఏమిటి? అదానీ నుంచి బొగ్గు కొనుగోలు చేయాలంటూ రాష్ట్రాలపై కేంద్రం ఒత్తిడి పెంచడంలో ఆంతర్యమేంటి?' అని 2017లోనే ఆయన ప్రశ్నించారు.అమెరికాలోని హిండెన్‌బర్గ్ సంస్థ 2023లోనే అదానీపై తీవ్ర ఆరోపణలు చేసింది. స్టాక్‌మార్కెట్‌లో అదానీ కంపెనీ షేర్ల విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నదని నివేదికను విడుదల చేసింది. దీంతో స్టాక్ మార్కెట్‌లో అదానీ షేర్ల విలువ ఘోరంగా పతనమైంది. అదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ-జేపీసీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కూడా డిమాండ్ చేశారు. దేశంలో ప్రధాని మోదీ, అదానీ కలిసి దోపిడీకి పాల్పడుతున్నారని రాహుల్ ఆరోపణలు చేస్తున్నారు. కానీ, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అదానీతో వేల కోట్ల రూపాయల ఒప్పందాలు ఎలా చేసుకుంటున్నది? అయితే, దావోస్ వేదికగా అదానీ కంపెనీతో రేవంత్ చేసుకున్న రూ.12,440 కోట్ల ఒప్పందం రాహుల్‌కు తెలియకుండానే జరిగిందా? ఇదిలా ఉంటే.. రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి రెడ్ కార్పెట్ పర్చడం, కొడంగల్‌లో సిమెంట్ ఫ్యాక్టరీకి ప్రతిపాదనలపై రేవంత్ ప్రభుత్వ వైఖరేంటో ప్రజలకు స్పష్టతను ఇవ్వాలి.అదానీతో రేవంత్ చేసుకున్న నేటి ఒప్పందాలు, రేపటి కుంభకోణాలనే విమర్శలు వినిపిస్తున్నాయి. తెరవెనుక దోపిడీ మంత్రాంగం నడుపుతూ తెరముందు గారడీ చేస్తున్నారంటూ రాహుల్, రేవంత్ పాలిట్రిక్స్‌ను ప్రజలు తూర్పారపడుతున్నారు. దేశంలో ప్రతిపక్ష పార్టీగా ఒక స్టాండ్, తెలంగాణలో అధికార పార్టీగా మరో స్టాండ్ తీసుకుంటూ అవినీతి ఆరోపిత అదానీకి కాంగ్రెస్ పార్టీ ఎర్ర తివాచీ పరుస్తున్నది. దీని వెనుక ఉన్న మతలబు ఏమిటో ప్రజలకు తెలువదా? దేశ సంపదను ఒకరు, రాష్ట్ర వనరులను మరొకరు పోటీపడి అవినీతి, ఆశ్రిత పెట్టుబడిదారులకు కట్టబెట్టడం భవిష్యత్ తరాలకు నష్టదాయకం.

# నాడు వారు...నేడు వీరు ..ప్రశ్నిస్తే ఎదురుదాడులు



హైదరాబాద్,రాజకీయ పార్టీలు అన్నీ ఒకేలా వ్యవహరిస్తాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓ మాట? అధికారం రాగానే మరో మాట. ఇది వాటి సహజ స్వభావం. పార్లమెంట్ సమావేశాలు అందుకు ఉదాహరణ. పార్లమెంట్ ని స్తంభింపజేయడం ప్రజాస్వామ్య రూపమేనని ఒకప్పుడు వాదించిన బిజెపి నేతలు ఇప్పుడు అదే పని చేస్తున్న ప్రతిపక్షంపై మండిపడుతున్నారు. ప్రతిపక్షాల నిరసన పార్లమెంట్ 'హైజాకింగ్' అట. ఈ మాట స్వయంగా ప్రధాని అన్నారు. అప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన నిరసన ఇప్పుడు పార్లమెంటును హైజాక్ చేయడం ఎలా అవుతుందో బీజేపీ నేతలే చెప్పాలి. తన సొంత రాజకీయ సందేశాలు ఇవ్వడానికి బిజెపి నాయకులు పార్లమెంటును వేదికగా ఉపయోగించు కుంటున్నారు. బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై ప్రతిపక్ష బిజెపి సభ్యులు పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయడాన్ని 2012 సెప్టెంబరులో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ తప్పుపట్టారు. దీనిపై బిజెపి సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ స్పందిస్తూ పార్లమెంట్ సమావేశాలను సాగనీయకపోవడం కూడా ప్రజాస్వామ్య రూపమేనని బదులిచ్చారు. యుపిఎ-2 ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు వచ్చాయని, అందుకే సభలో ఆందోళన చేస్తున్నామని ఆమె తెలిపారు. ఇది జరిగి ఓ సంవత్సరం గడిచింది. పార్లమెంటరీ నిబంధనలను ఉల్లంఘిం చారంటూ 20 మంది బిజెపి, తెలుగుదేశం సభ్యులను హౌస్ బులెటిన్‌లో ప్రస్తావించినందుకు బిజెపి ఎగువ సభలో నిరసన తెలిపి, ఆ తర్వాత వాకౌట్ చేసింది. దీనిని సీనియర్ నేత అరుణ్ జైట్లీ సమర్థించుకున్నారు. ఆందోళన చేసిన అధికార పక్ష సభ్యులను వదిలేసి కేవలం ప్రతిపక్ష సభ్యులను మాత్రమే శిక్షించారని ఆయన మండిపడ్డారు. ఘటనలు జరిగి దశాబ్ద కాలం అయింది. ఇప్పుడు పార్లమెంట్ లో స్థానాలు మారాయి. అటు వారు ఇటు, ఇటు వారు అటు అయ్యారు. ప్రధా ని నరేంద్ర మోడీ ఆనాటి పార్టీ నేతల మాటలు మరచిపోయారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసన 'హైజాకిం గ్'కు ఓ రూపమని వ్యాఖ్యానించారు. 'ప్రజలు తిరస్కరించిన కొందరు వ్యక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం విచ్ఛిన్నకర ఎత్తుగడల ద్వారా పార్లమెంటుపై నియంత్రణకు నిరంతరం ప్రయ త్నిస్తున్నారు' అని విమర్శించారు. అప్పటి నుండి ఆయన మద్దతుదారులు, ఇతర బిజెపి నేతలు ఆయన మాటలను తరచూ వల్లె వేస్తూ పార్లమెంట్ కార్యకలాపాలను స్తంభింపజేయ డానికి ఏ రూపంలో ప్రయత్నించినప్పటికీ అది దేశాభివృద్ధిని అడ్డుకోవడానికి జరిపే కుట్రగానే భావించాలంటూ వితండవాదం మొదలు పెట్టారు. ఇక కార్పొరేట్ మీడియా కూడా ప్రధాని వ్యాఖ్యలను వెనకేసుకొచ్చింది. కొన్ని అంశాలపై చర్చ జరగాలన్న ప్రతిపక్ష సభ్యుల డిమాండ్ నుండి ప్రజల దృష్టిని మరలించేందుకు అది ప్రయత్నిస్తోంది కూడా. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యుల మధ్య నెలకొన్న వివాదానికి అదానీ కేంద్ర బిందువయ్యారు. ఆయనపై మోసం, ముడుపు ల ఆరోపణలు మోపుతూ న్యూయార్క్ కోర్టులో ఛార్జిషీటు దాఖలైంది. కేంద్ర ప్రభుత్వానికి, అదానీ గ్రూపునకు మధ్య ఉన్న సంబంధాలపై కాంగ్రెస్‌తో పాటు అనేక ఇతర ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై చట్టసభలో చర్చించాలని ఆ పార్టీలు కోరుతుంటే ప్రభుత్వం ససేమిరా అంటోంది. ఘర్షణలతో అట్టుడికిపోతున్న మణిపూర్‌పై కూడా చర్చించాల్సి ఉన్నదని ప్రతిపక్షాలు అడుగుతుంటే అందుకు కూడా ప్రభుత్వం అంగీకరించడం లేదు. దీంతో సభ నుండి వాకౌట్ చేయడమో లేదా సభను బహిష్కరించడమో తప్ప ప్రతిపక్షాలకు వేరే మార్గం లేకుండా పోతోంది. రూల్ 267 కింద ప్రతిపక్షాలు అసాధారణ రీతిలో నోటీసులు అందించారు. లిస్టింగ్ అయిన సభా కార్యక్రమాలను ఆపేసి, అత్యవసర అంశాలపై చర్చకు పట్టుపట్టడానికి ఈ రూల్‌ను ప్రతిపక్షాలు వాడుకుంటాయి. సభా కార్యకలాపాలు నిలిచిపోవడానికి ప్రతిపక్షాలే బాధ్యత వహించాలని కార్పొరేట్ మీడియా నిందిస్తోంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే ముగిసిపోతాయేమోనని అది ఆందోళన వ్యక్తం చేస్తోంది. రూల్ 267 కింద చర్చకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ నిరాకరించారు. మణిపూర్ హింస, వరదల బారినపడి నష్టపోయిన వాయనాడ్‌కు ప్రత్యేక సాయం, బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై జరుగుతున్న హింసపై కూడా చర్చ జరగాలని ప్రతిపక్షాలు కోరగా ప్రభుత్వం విముఖత చూపుతోంది. 2012లో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతిపక్ష బిజెపి డిమాండ్ మేరకు బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణంపై చర్చించేందుకు అంగీకరించారు. నిర్భయ సామూహిక అత్యాచార ఘటనపై కూడా రోజుల తరబడి చర్చ సాగింది. ఈ చర్చల కారణంగానే లైంగిక దాడి విషయంలో కొత్త చట్టం వచ్చింది. అయితే ఇప్పుడు కాషాయ పార్టీ మాత్రం పార్లమెంటును తన రాజకీయ సందేశాల కోసం వాడుకుంటోంది. సభలో చర్చల సమయంలో హిందీని ప్రధాన భాషగా రుద్దేందుకు ఆ పార్టీ ప్రయత్నించింది. ఇరువురు సభాపతులు తటస్థ పరిశీలకుల మాదిరిగా కాకుండా బిజెపి ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేసే ప్రతిపక్ష నేతల మైక్రోఫోన్లను కట్ చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా సభా కార్యకలాపాలు ఏకపక్షంగానే సాగుతున్నాయి. ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తుంటే వారిని సభ నుండి బహిష్కరిస్తున్న ఉదంతాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. హిందూత్వ ప్రచార చిత్రం 'ది సబర్మతి రిపోర్ట్'ను వీక్షించేందుకు మోడీ, ఆయన క్యాబినెట్ సహచరులు ఇటీవల పార్లమెంట్ గ్రంథాలయాన్ని వేదికగా మార్చేశారు. గడచిన రెండు ప్రభుత్వాల పాలనలోనూ ప్రధాని మోడీ పార్లమెంటుకు వచ్చిన సందర్భాలు చాలా అరుదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో జరిగిన చర్చకు ఇచ్చిన సమాధానాన్ని కూడా ఆయన ఎన్నికల ప్రచారంగా మార్చేశారు. పార్లమెంటులో ప్రతిపక్షం లేవనెత్తిన ప్రశ్నలపై ప్రభుత్వ వైఖరిని ఆయన స్పష్టం చేయలేదు. ఒకవేళ ప్రభుత్వం వైపు నుండి సమాధానాలు వచ్చినా అవి సాదాసీదాగా, దాటవేసే రీతిలో ఉంటున్నాయి. సభలో చర్చ జరపకుండానే అనేక బిల్లులను ప్రభుత్వం ఆమోదింపజేసుకుంది. బిల్లుల ప్రతులు తమకు అందలేదని, ముసాయిదాల అధ్యయనానికి తమకు తగిన సమయం ఇవ్వలేదని ప్రతిపక్షం తరచూ ఫిర్యాదు చేసింది. ప్రతిపక్ష ఎంపీలను ప్రజలు తిరస్కరించారంటూ మోడీ చేసిన ప్రకటన వారి పాత్రను తక్కువ చేసి చూపడమే అవుతుంది. వాస్తవానికి ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించింది ప్రతిపక్షాలను కాదు? బిజెపినే. భారత ప్రజాస్వామ్యంపై వ్యక్తమవుతున్న ఆందోళనకు పార్లమెంట్ 'హైజాకింగే' నిజమైన కారణమైతే అందుకు ఎవరిని నిందించాలో అందరికీ తెలిసిందే.

# బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీలను కాపాడండి!




న్యూఢిల్లీ,స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత బంగ్లాదేశ్ అతిపెద్ద సంక్షోభాన్ని ప్రస్తుతం ఎదుర్కొంటోంది. తిరుగుబాటు తర్వాత ఛాందసవాదుల రాజకీయ ఆధిపత్యం కారణంగా అస్థిరమైన అరాచక వాతావరణం అక్కడి హిందూ సమాజానికి తీవ్ర ఆందోళన కలిగించే అంశంగా మారుతూ వస్తోంది. ఈ దాడుల పట్ల ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు పెరుగుతున్నాయి. షేక్ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ అధికారం కోల్పోవడం ఆ తర్వాత మిలిటరీ సహకారంతో ముహమ్మద్ యునాస్ మత (చందసవాది) నాయకత్వంలో మధ్యంతర ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మైనార్టీలపై హిందువులపై దాడులు అధికంగా నమోదయ్యాయి. ఈ దాడులకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో మైనార్టీ హిందువులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. తమ రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో 2024 అక్టోబర్ 25 నాడు చిట్టగాంగ్ న్యూ మార్కెట్ వద్ద జరిగిన నిరసనలో చిన్మయి కృష్ణదాస్ పాల్గొన్నారనే ఆరోపణపై తాజాగా ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేయబడింది. ఈయన ఇస్కాన్ సంస్థ ప్రతినిధి. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీల హక్కుల కోసం పోరాడుతున్న ప్రముఖ మఠాధిపతి. ఆందోళన సమయంలో కాషాయ (సాఫ్రాన్) జెండా ను బంగ్లాదేశ్ జాతీయ పతాకంపైన ఉంచి నట్లు ఆరోపించి ఆయన మీద, మరో పంతొమ్మిది మంది మీద దేశ ద్రోహం కేసు నమోదు చేశారు. ఆయనను ఢాకా విమానాశ్రయంలో అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో ఆ దేశంలో మైనార్టీల రక్షణ భద్రత పరమైన అంశాల గురించి అక్కడి మైనార్టీలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆయన అరెస్టును నిరసిస్తూ భారీ ఆందోళన చేపట్టారు. ఇదే సమయంలో బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ ఇంటర్నేషనల్ సంస్థను నిషేధించాలంటూ ఆ దేశ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు అయ్యింది.

### పూజారిపై దేశ ద్రోహం కుట్ర..!

చిన్మయి క్రిష్ణ దాస్ అరెస్టుకు వ్యతిరేకంగా ఇస్కాన్ ఇంటర్నేషనల్ సంస్థతో పాటు శ్రీ శ్రీ రవిశంకర్, సద్గురు లాంటి అనేక మంది ప్రముఖులు, హిందూ సంఘాలు ఈ అరెస్ట్ పై నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఢిల్లీలోని బంగ్లా దౌత్య కార్యాలయం ముందు కూడా హిందూ సంఘాలు నిర సన కార్యక్రమాలు చేపట్టాయి. తక్షణమే ఆయనను విడుదల చేయాలని ఆయనపై నమోదైన దేశ ద్రోహం కేసు కుట్రపన్ని కావాలని వేశారని అక్కడ మైనారిటీలపై జరుగుతున్న హింసను ప్రపంచానికి చాటి చెబుతున్నారు. ఆయన మొదటి నుండి బంగ్లాదేశ్‌లో హిందూ హక్కుల గురించి హిందూ మైనార్టీలకు రక్షణ కల్పించాలని పోరాడుతున్నారు.. కాబట్టే ఆయన గొంతు నొక్కే ప్రయత్నంలో భాగంగా దేశ ద్రోహం కేసు వేశారని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంలో తక్షణమే భారత ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆయన విడుదలకు కృషి చేయాలని ఇస్కాన్ సంస్థ కోరుతుంది.

### చిన్మయి తరపున వాదిస్తే దాడులు..

ఆయన అరెస్ట్ తర్వాత చిన్మయ్ క్రిష్ణాదాస్ ప్రభూకి బంగ్లాదేశ్ కోర్టు బెయిల్ నిరాకరించడం జరిగింది. పైగా ఎవరైనా చిన్మయి క్రిష్ణదాస్ తరుపున వకాల్తా పుచ్చుకుని కేసుని వాదిస్తే వాళ్ల పరిస్థితి ఘోరంగా మారుతుందని బహిరంగంగా ప్రకటించారు. అయినప్పటికీ వారి బెదిరింపులకు భయపడకుండా రమన్ రాయ్ క్రిష్ణ దాస్ తరుపున వకాల్తా పుచ్చుకొని వాదించడనికి తయారైతే చెప్పినట్లే ఇస్లామిక్ రాడికల్స్ ఆయన ఇంట్లో చొరబడి దాడి చేయడంతో అత్యంత తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో ప్రాణాలతో బయట పడటానికి పోరాడుతున్నాడు. కోర్టులోని మిగతా లాయర్లు కూడా ఎవరైనా చిన్మయి క్రిష్ణ దాస్ తరుపున వకాల్తా పుచ్చుకుని వాదిస్తే రమణ్ రాయ్ కి పట్టిన గతే పడుతుందని కోర్టులోనే బహిరంగంగా బెదిరిస్తున్నారు. ఈ ఘటన తర్వాత బంగ్లాదేశ్ లో ఏ ఒక్క వకిల్ కూడా చిన్మయి క్రిష్ణ దాస్ తరుపున వాదించడానికి సాహసం చేయకపోవటం అక్కడి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఆయన తరపున వాదించడానికి ఎవరు ముందుకు రాకపోవడంతో ఈ కేసు జనవరి 2కి వాయిదా పడింది. దీంతో ఆయన అప్పటి వరకు జైల్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### కేంద్ర ప్రభుత్వ నిరాసక్తత దేనికి?

బంగ్లాదేశ్‌లో హిందువుల మీద జరుగుతున్న మతపరమైన హింసకు ముఖ్య కారకుడుకు మాస్టర్ మైండ్ మహమ్మద్ యూనస్ అని మాజీ ప్రధాని షేక్ హసీనా చెప్పడం గమనార్హం! హిందువులపై జరుగుతున్న హింస మీద ప్రపంచదేశాల మద్దతు కూడగట్టడంలో ఎందుకు మోడీ ప్రభుత్వం చొరవ తీసుకోవడం లేదు? వెంటనే బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రపంచ వ్యాపితంగా బంగ్లా దేశ్‌కి వ్యతిరేకంగా మహ్మద్ యునస్ ప్రభుత్వం మైనార్టీల మీద జరుగుతున్న మతపరమైన హింసను నివారించడానికి ప్రపంచ దేశాలతో బంగ్లాదేశ్ మీద ఒత్తిడి పెంచేలా చేయడం లాంటి చొరవ తీసుకొని అక్కడి మైనార్టీలను రక్షించే ప్రయత్నం చేయాలి.

### ఐక్యరాజ్యసమితి జోక్యం అవసరం!

బంగ్లాదేశ్‌లో వివక్ష, అణచివేతకు గురవుతున్న హిందూ జనాభా నిరంతరం తగ్గిపోతుంది. నేడు బంగ్లాదేశ్ మొత్తం జనాభాలో హిందువుల వాటా 1951తో పోలిస్తే 14 శాతం మేర తగ్గిపోయింది. హిందూ- అమెరికన్ ఫౌండేషన్ నివేదిక ప్రకారం.. 1964 నుంచి 2013 మధ్య మతపరమైన హింస కారణంగా 11 మిలియన్లకు పైగా హిందువులు బంగ్లాదేశ్ నుంచి పారిపోయారు. ప్రతి సంవత్సరం 2.3 లక్షల మంది దేశం విడిచి వెళుతున్నారని ఆ నివేదిక వెల్లడించింది. 2000 నుంచి 2010 మధ్య దేశ జనాభా నుంచి ఒక మిలియన్ హిందు వులు అదృశ్యమయ్యారని 2011 జనాభా లెక్కలు తెలియజేస్తున్నాయి.బంగ్లాదేశ్ ప్రభుత్వం మైనార్టీలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైన నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి ఈ విషయంలో జోక్యం చేసుకుని హిందూ మైనార్టీలకు రక్షణ కల్పించాలని వారి ఆస్తులను హక్కులను ప్రాణాలను కాపాడాలని కోరుకుందాం.

# వైభవంగా అమ్మవారి పంచమీ తీర్థం

తిరుపతి, తిరుచానూరులోని పద్మావతి అమ్మవారు బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అఖరు రోజు శుక్రవారం పంచమి తిథిని పురస్కరించుకుని అశేష భక్తజనవాహిని మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. పద్మ పుష్కరిణిలో స్నానం ఆచరించిన భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వాన్ని పొందారు. ముందుగా పంచమి తీర్థ మండపంలో అమ్మవారికి, చక్రత్తాళ్వార్‌కు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి అలంకరించిన పూలమాలలు, కిరీటాలు భక్తులకు కనువిందు చేశాయి. అంతకుముందు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఈవో, అదనపు ఈవోలకు టీటీడీ తరుపున సారెను అందజేశారు. సారెకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు-కుంకుమ, చందనం, పట్టుచీరతో పాటు రూ కోటి 20 లక్షలతో వెచ్చించి ప్రత్యేకంగా తయారు చేయించిన స్వర్ణ కిరీటం, వజ్రాలహారం, గాజులు, దుద్దెలు సారెగా సమర్పించారు.

# డీప్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు

అమరావతి, ఏపీలో డీప్ టెక్నాలజీతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని సీఎం చంద్రబాబు అన్నారు. వంద శాతం గ్రీన్ ఎనర్జీకి వెళ్ళాలి అనేది మా ప్రభుత్వం లక్ష్యమని వెల్లడించారు. విశాఖపట్నంలో నిర్వహించిన డీప్‌టెక్ ఇన్నోవేషన్ కాంక్లేవ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ మారాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం సాంకేతికతను అందిపుచ్చుకుంటుందని పేర్కొన్నారు. టెక్నాలజీ జీవితంలో ఒక భాగంగా మారిందని అన్నారు. ఐటీ, నాలెడ్జ్ ఎకానమీలో యువత సమర్థులుగా మారుతున్నారని, విదేశాల్లోని మన దేశ ఐటీ నిపుణులుల్ల 30శాతం తెలుగువారే ఉండడం గర్వకారణమని వెల్లడించారు. ఎన్ని ఎక్కువ ఉద్యోగాలు ఇస్తే, అన్ని ఎక్కువ రాయితీలు మా ప్రభుత్వం ఇస్తుందని , పెట్టుబడులతో వస్తున్న వారికి అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. నదుల అనుసంధానంతో నీటి కొరత అనేదే ఉండదు. ఆహార ఉత్పత్తులు, సరఫరాలో గ్లోబల్ హబ్ గా ఏపీ మారబోతోందని తెలిపారు. అరకు కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు ఉందని అన్నారు. రాష్ట్రానికి ఉన్న వనరుల్లో తీరప్రాంతం ఒకటని, తీర ప్రాంతాన్ని పారిశ్రామికంగా పరుగులు పెట్టిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత పెరగడంతో పాటు రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. గత ప్రభుత్వ నిర్వాకంతో వచ్చిన అనేక సమస్యలను అధిగమిస్తున్నామని, . సెకండ్ క్వార్టర్ లో, దేశ గ్రోత్ రేట్ 8 % అయితే, ఆంధ్రప్రదేశ్ గ్రోత్ రేట్ 8.75% కి వచ్చామని తెలిపారు.

# హాజరా? గైర్హాజరా?!

హైదరాబాద్,తెలంగాణలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతాయని గవర్నర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సమావేశాలలో పలు అంశాలు చర్చించనున్నట్లు తెలుస్తోంది. అయితే, అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారనేది ఈ నెల 9న జరిగే బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. సంక్రాంతి తరువాత రైతు భరోసా నిధులు వేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందుకు సంబంధించిన విధి విధానాల రూపకల్పనపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే పలు అంశాలతో కూడిన నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశాలను అసెంబ్లీలో చర్చించి అర్హులైన రైతులకే రైతు భరోసా దక్కేవిధంగా ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది. మరోవైపు కొత్తగా తీసుకురానున్న ఆర్వోఆర్ చట్టంతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న కులగణన సర్వే గణాంకాలను అసెంబ్లీలో పెట్టి చర్చించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం పూర్తయ్యింది. ఈ సంవత్సరకాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ నేతలు పదేపదే విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలపై గళమెత్తేందుకు బీఆర్ఎస్ రెడీ అవుతోంది. దీంతో అసెంబ్లీ శీతాకాల సమావేశాలు హాట్ హాట్ గా జరిగే అవకాశాలున్నాయి. అయితే ప్రతిపక్షంగా బీఆర్ఎస్ తరపున నేతలు సభలో ఎంత గట్టిగా గళమెత్తినా, కేసీఆర్ సభకు గైర్హాజరైతే మాత్రం సభలో కాంగ్రెస్ దే పై చేయి కావడం ఖాయమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరిన ఈ ఏడాది కాలంలో ఇప్పటి వరకూ రెండు సార్లు అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. ఆ రెండు సందర్భాలలోనూ కాంగ్రెస్, బీఆర్ఎస్ సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో వాదోపవాదనలు జరిగాయి. అయితే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభలో లేకపోవటంతో కాంగ్రెస్ ఆధిపత్యం స్పష్టంగా కనిపించింది. బీఆర్ఎస్ తరపున కేటీఆర్, హరీశ్ రావు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నాలు చేసినా కాంగ్రెస్ సభ్యులు దీటుగా సమాధానం ఇచ్చారు. కేసీఆర్ సభలో ఉండిఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్న భావన గత రెండు సందర్భాలలోనూ బీఆర్ఎస్ శ్రేణులలో వ్యక్తం అయ్యింది. కేసీఆర్ మాత్రం ఒక్కరోజు మినహా అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన ఒక్కరోజు మాత్రమే అసెంబ్లీకి కేసీఆర్ హాజరయ్యారు. ఆరోజు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల బడ్జెట్ కాదని, అవసరమైన పథకాలకు, ప్రాజెక్టులకు బడ్జెట్ లో నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఇక నుంచి అసెంబ్లీకి వస్తా కాంగ్రెస్ ప్రభుత్వం అంతుచూస్తానంటూ కేసీఆర్ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఇక నుంచి అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులకు కేసీఆర్ చుక్కలు చూపించడం ఖాయమని.. రేవంత్ ఇక కాస్కో అంటూ.. బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా అప్పట్లో పోస్టులు పెట్టాయి. అయితే, కేసీఆర్ మాత్రం అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాలేదు. దీంతో బీఆర్ ఎస్ శ్రేణులు తీవ్రస్థాయిలో నిరాశకు గురయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై అనేక అవినీతి, అక్రమాలకు సంబంధించి ఆరోపణలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ , కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి , విద్యుత్ కొనుగోళ్ల విషయంలో అవినీతికి జరిగిందంటూ ఆరోపణలు చేశారు. ఈ అంశాలపై విచారణకు సైతం ఆదేశించారు. అయినా కేసీఆర్ మాత్రం మౌనం వీడలేదు. అధికారం కోల్పోయిన నాటినుంచి ఆయన కేవలం ఫాంహౌస్‌కే పరిమితం అవుతున్నారు. అసెంబ్లీ సమావేశాలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ రావాలని అనేక సార్లు సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అయితే గతంలో కొందరు బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ సమావేశాలకు రావాలని కేసీఆర్ వద్ద ప్రస్తావించగా.. ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని, సంవత్సర కాలం సమయం ఇచ్చిన తరువాత ప్రభుత్వం పనితీరు, విధానాలపై ప్రశ్నిద్దామని చెప్పినట్లు తెలిసింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సర కాలం పూర్తయ్యింది.

## ప్రయాణికులకు తీపికబురు చెప్పిన రైల్వే

న్యూఢిల్లీ, ఎక్స్ప్రెస్, సూపర్ఫాస్ట్ రైళ్లలో జనరల్ బోగీల సంఖ్యను దశలవారీగా పెంచుతున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు రెండే జనరల్ కోచ్ లు ఉన్న రైళ్లలో ఆ సంఖ్యను నాలుగుకు చేరుస్తున్నట్లు పేర్కొన్నారు. అవి కూడా ఆధునిక పరిజ్ఞానం కలిగిన ఎల్.హెచ్.బి కోచ్ లు ఉంటాయని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు వెల్లడించారు. జోన్ పరిధిలోని 21 జతల రైళ్లకు అదనగా 80 ఎల్.హెచ్.బి బోగీలను అందుబాటులోకి తీసుకొస్తామన్న సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు. రైళ్లలో పేదలు ప్రయాణించే జనరల్ బోగీల రూపం కూడా మారబోతున్నది. ఇన్నాళ్లు రైళ్లలో పాతకాలం నాటి సాధారణ బోగీలే ఉన్నాయి. చాలా రైళ్లలో రెండే బోగీలు ఉండటంతో పేద ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. దాని కారణంగా జనరల్ బోగీల సంఖ్యను పెంచేందుకు రైల్వేబోర్డు కార్యాచరణ ప్రారంభించింది. కొత్తగా వస్తున్న జనరల్ బోగీలను ఎల్.హెచ్.బి పరిజ్ఞానంతో తయారుచేసినవి ప్రవేశ పెడుతున్నారు. పాత తరం ఐసీఎఫ్ బోగీల్లో 90 సీట్లు ఉంటే.. ఎల్.హెచ్.బి బోగీల్లో సీట్ల సంఖ్య 100 ఉంటాయి. ఇందులో ఎక్కువ మంది ప్రయాణించే అవకాశం ఉంటుంది. ప్రమాదాలు జరిగినప్పుడు సైతం తక్కువ నష్టం ఉంటుందంటున్న రైల్వే అధికారులు. ఏసీ, స్లీపర్ క్లాస్ లలో మాత్రమే ఎల్.హెచ్.బి బోగీలను రైల్వే శాఖ ప్రవేశపెడుతూ వచ్చింది. కానీ తాజాగా ఇప్పుడు జనరల్ క్లాస్ లలో ఎల్.హెచ్.బి కోచ్ లను అందుబాటులోకి ఇస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే. ఇప్పటికే జోన్ పరిధిలో 19 ఎక్స్ ప్రెస్ రైళ్లకు ఎల్.హెచ్.బి కోచ్లను 66 కోచ్లను ప్రవేశపెట్టారు. గౌతమి, దక్షిణ్, నారాయణాద్రి తదితర ఎక్స్ప్రెస్ రైళ్లలో అదనంగా ఎల్.హెచ్.బి జనరల్ కోచ్ లు వచ్చాయి. రైల్వేశాఖ దేశవ్యాప్తంగా 370 రైళ్లలో అదనంగా ఎల్.హెచ్.బి బోగీలను దశలవారీగా జత చేస్తోందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఫలితంగా రోజూ అదనంగా 70 వేల మంది ప్రయాణికులు జనరల్ బోగీల్లో ప్రయాణించేందుకు ఆస్కారం ఉంటుంది. సాధారణ ప్రయాణికులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

## ఎస్సై హరీష్ ఆత్మహత్య ఘటనలో యువతిని అదుపులోకి..

హైదరాబాద్, ములుగు జిల్లాలో ఎస్సై రుద్రారపు హరీష్ ఆత్మహత్యలో ట్విస్ట్ చోటు చేసుకుంది. హరీష్ ఆత్మహత్య ఘటనలో యువతిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఏడు నెలల కిందట హరీష్కు ఓ యువతి అనుకోకుండా ఫోన్ చేయగా, మాటామాటా కలిసి.. ఇన్స్టాగ్రామ్లో ఇద్దరూ చాట్ చేసుకునేవారు. హైదరాబాద్లో చదువుకునే ఆమె వారంలో రెండు రోజులు వాజేడుకు వచ్చి ఉండి వెళ్లేది.. కొంతకాలానికి యువతి బ్యాగ్రౌండ్ వెరిఫై చేయగా.. తను వేరే వాళ్లతో చనవుగా ఉన్నట్లు హరీష్ గుర్తించాడు. దీంతో తన ప్రవర్తన నచ్చక దూరంపెట్టాడు ఎస్సై. ఆపై వేరే యువతితో పెళ్లికి సిద్ధమైయ్యాడు. విషయం తెలుసుకున్న యువతి తనను పెళ్లి చేసుకోవాలని హరీష్ వెంటపడింది. దీనికి హరీశ్ ఒప్పుకోకపోవడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చెబుతాననంటూ బెదిరించింది. అధికారులకు తెలిస్తే పరువుపోతుందని మనస్తాపంతో హరీష్ సర్వీస్ రివాల్వర్తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడి మృతికి ఆ యువతే కారణమంటూ హరీశ్ తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో, ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డిసెంబర్ 2వ తేదీ ములుగు జిల్లాలోని ముళ్లకట్ట సమీపంలోని ఓ రిసార్ట్స్లో తన సర్వీస్ రివాల్వర్తో కాల్చుకుని వాజేడ్ ఎస్ఐ హరీశ్ బలవన్మరణానికి పాల్పడ్డారు. వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తొలుత ప్రచారం జరిగింది. ఏటూరు నాగారంలో ఎన్కౌంటర్ జరిగిన రాత్రే ఆయన సూసైడ్ చేసుకోవడంతో పలు అనుమానాలకు దారి తీసింది. ఘటనా స్థలానికి చేరుకున్న ఉన్నత అధికారులు విచారణ చేసి అసలు నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు.

## సౌదీలో డ్రగ్స్ కేసులో భారతీయుడికి మరణశిక్ష

మీరట్,మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణల కేసులో ఉత్తర ప్రదేశ్ కు చెందిన ఒక యువకుడికి సౌదీ అరేబియా కోర్టు మరణ శిక్ష విధించింది. యూపీలోని మీరట్ జిల్లాలో ఉన్న ముండాలి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాచౌటి గ్రామానికి చెందిన మహ్మద్ జైద్ (36)కు సౌదీ అరేబియా కోర్టు మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలపై మరణశిక్ష విధించింది. డ్రగ్స్ కేసులో 2023 జనవరి 15 నుంచి జైద్ జెడ్డా సెంట్రల్ జైలులో మగ్గుతున్నాడు. సౌదీలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను తీవ్రమైన నేరంగా పరిగణిస్తారు. ముండాలి పోలీసులు మంగళవారం రాచౌటి గ్రామంలోని జైద్ కుటుంబ సభ్యులకు ఈ సమాచారం అందించారు. దాంతో, అతని కుటుంబ సభ్యులు షాక్ కు గురయ్యారు. జైద్ తరఫున అతడి కుటుంబ సభ్యులు వాదించాలనుకుంటే, వారు సౌదీ అరేబియా అంతర్గత మంత్రిత్వ శాఖను, సంబంధిత కోర్టును సంప్రదించవచ్చని ఆ నోటీసులో పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలు ఎదుర్కొంటున్న జైద్ 2023 జనవరి 15 నుంచి సౌదీ అరేబియాలోని జెడ్డా సెంట్రల్ జైలులో ఉన్నాడని నోటీసులో పేర్కొన్నారు. మక్కాలోని క్రిమినల్ కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. అక్కడ జైద్ కు మరణశిక్ష విధించారు. జైద్ 2018లో సౌదీ అరేబియా వెళ్లి ఓ కంపెనీలో డ్రైవర్ గా పనిచేస్తున్నాడని జైద్ తమ్ముడు మహ్మద్ సాద్ తెలిపారు. సౌదీలో తన సోదరుడు ప్రమాదానికి గురయ్యాడని, ఆ క్రమంలో అతడికి ఆహారం, ఇతర రోజువారీ అవసరాలు తీర్చినందుకు బదులుగా స్థానిక పోలీసు ఒకరు తన సోదరుడిని డ్రైవర్ గా వాడుకుంటున్నాడని మహ్మద్ సాద్ ఆరోపించాడు. భారత్ కు తిరిగి వెళ్తానని తన సోదరుడు పట్టుబట్టడంతో అతడిని తప్పుడు కేసుల్లో ఇరికించారని సాద్ చెప్పారు.

## తప్పులు చేస్తే ఉపేక్షించం

హైదరాబాద్,యూపీఎస్సీతో సమానంగా టీజీపీఎస్సీ పని చేస్తుందని, కమిషన్?పై పూర్తి విశ్వాసాన్ని తిరిగి తీసుకురావడానికి కృషి చేస్తామని నూతన టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం అన్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్?గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో కమిషన్ సభ్యులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీజీపీఎస్సీ అభ్యర్థులను ఉద్దేశిస్తూ మాట్లాడారు. పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేస్తామని, ఎడ్యుకేషన్?లో ఉన్న సమయంలో 60 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రణాళిక బద్ధంగా ప్రతి పరీక్ష నిర్వహిస్తామని, పరీక్షలు ప్రశాంతంగా, విశ్వాసభరితంగా రాసేలా చర్యలు తీసుకుంటామని బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. అభ్యర్థులు, నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు మూడున్నర ఏళ్ల సర్వీస్?ను వదులుకుని టీజీపీఎస్సీ ఛైర్మన్?గా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలు లేకుండా పరీక్షలు రాయాలని, టీజీపీఎస్సీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా అంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కమిషన్?కు సమాచారం ఇచ్చేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్ కూడా కేటాయిస్తామని ప్రకటించారు. టీజీపీఎస్సీకి స్వయం ప్రతిపత్తి ఉందని, దీంతో ఎవరికీ భయపడకుండా పని చేస్తామని ఉద్ఘాటించారు. ఎవరూ తప్పులు చేసినా ఉపేక్షించమని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. విద్యాశాఖలో ఉండటం వల్ల ప్రశ్నల తయారీపై మంచి అవగాహన సాధించానని, పోటీ పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నల్లో తప్పులు లేకుండా చూస్తామని పేర్కొన్నారు.

# మహానగరంపై వరల్డ్ క్లాస్ ఐడియా.. సీఎం రేవంత్ మాస్టర్ ప్లాన్




హైదరాబాద్,హైదరాబాద్ ను మరో శిఖరానికి చేర్చాలి. ఇది మనకే కాదు.. దేశానికే గ్రోత్ ఇంజిన్. కాబట్టి డెవలప్ మెంట్ ఎంత చేస్తే అంత స్కోప్ ఉన్న సిటీ ఇది. అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హైదరాబాద్ ను మరో కోణంలో ఆవిష్కరించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పగ్గాలు చేపట్టిన ఏడాదిలోనే హైదరాబాద్ దశ దిశను మార్చే నిర్ణయాలు తీసుకుంది రేవంత్ ప్రభుత్వం. అవి పట్టాలెక్కి.. అమలు అయితే మాత్రం హైదరాబాద్ నెక్స్ లెవెల్ కు వెళ్లడం ఖాయం.

**చిన్న సమస్యల నుంచి పెద్ద వాటి దాకా ఫోకస్**

చూశారుగా ఈ సీన్. హైదరాబాద్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ఎంత ఫోకస్డ్ గా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. మైక్రో లెవెల్ దగ్గర్నుంచి మాక్రో లెవెల్ దాకా అన్నిటినీ జాగ్రత్తగా డీల్ చేస్తున్నారు. ఇది హైదరాబాద్ లేక్వ్యూ గెస్ట్ హౌజ్ ఏరియా. ఇక్కడ వరద నియంత్రణ కోసం నిర్మిస్తున్న రెయిన్ వాటర్ సంప్ పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. భారీ వర్షాలు, వరదలు చిన్నపాటి వరదొచ్చినా నగరంలో చాలాచోట్ల రోడ్లు జలమయమై ట్రాఫిక్తో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మొత్తం 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద వెంటవెంటనే నీరు వెళ్లేలా శాశ్వత పరిష్కారం చూపాలని గతంలో సీఎం ఆదేశించారు. అంతే కాదు పనులను పర్యవేక్షించారు. సో ఈ ఒక్క చిన్న ఎగ్జాంపుల్ చాలు హైదరాబాద్ డెవలప్ మెంట్ గురించి సీఎం ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థం చేసుకోవడానికి.

**హైదరాబాద్ విజన్ 2050కి సీఎం రేవంత్ ప్లాన్**

హైదరాబాద్ 2050కి సీఎం రేవంత్ ప్లాన్ చేస్తున్నారు. అప్పటి వరకు హైదరాబాద్ పూర్తిగా రూపురేఖలు మార్చేలా ఇప్పటి నుంచే పునాదులు వేస్తున్నారు. రోడ్ మ్యాప్ రెడీ చేయించారు. కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఎందుకంటే ముందు చూపు ఉంటేనే ఇలాంటి మహానగరాల దశ మారుతుంది. ఓవైపు పెరిగే జనాభా, పెరిగే ఉపాధి అవకాశాలకు తోడు, రవాణా సౌకర్యాలు కల్పించడం, రోడ్లు వేయడం, మెట్రో విస్తరణ, ఇవన్నీ కీలక పాత్ర పోషిస్తాయి. ఇప్పటి నుంచే క్లారిటీ లేకపోతే భవిష్యత్ కష్టంగా ఉంటుంది. అందుకే సీఎం రేవంత్ హైదరాబాద్ రైజింగ్ కోసం సీరియస్ గా ఫోకస్ పెట్టారు.

**ఫోర్త్ సిటీ నిర్మాణం వరల్డ్ క్లాస్ ఐడియా**

నిజానికి హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ గా మారిపోయింది. కులీకుతుబ్ షా కాలం నుంచి రకరకాల మార్పులు చెందుతూ చంద్రబాబు, వైఎస్ హయాంలో సైబరాబాద్ అభివృద్ధి జరిగింది. టెక్నాలజీ హబ్ గా ఆ ప్రాంతం మారిపోయింది. ఇక అక్కడితో హైదరాబాద్ డెవలప్ మెంట్ ఆగిపోకూడదు అని సీఎం రేవంత్ గట్టిగా సంకల్పం తీసుకున్నారు. అందుకే ఫోర్త్ సిటీ కోసం అడుగులు వేస్తున్నారు. అది నెక్స్ లెవెల్ డెస్టినేషన్. టెక్నాలజీ మొదలుకొని, స్పోర్ట్స్, ఏఐ, ఐటీ, టూరిజం, హాస్పిటాలిటీ, ఇండస్ట్రియల్ ఒక్కటేమిటి అన్నీ ఫ్యూచర్ సిటీలో రాబోతున్నాయి. అదో అద్భుతమైన ప్రపంచంగా మారుతుంది. ఏ అద్భుతం కూడా రాత్రికి రాత్రి జరగదు. టైం పట్టినా సరే.. ఫోర్త్ సిటీని నిలబెట్టి ప్రపంచానికి చూపాలనుకుంటున్నారు సీఎం రేవంత్ రెడ్డి. మధ్యలో ఎన్ని విమర్శలు వచ్చినా సరే ముందుకు వెళ్లడమే టార్గెట్ గా పెట్టుకున్నారు.

**ఫోర్త్ సిటీని ప్రపంచానికి పరిచయం చేసే బాధ్యత**

హైదరాబాద్ అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి ఏడాది పాలనలోనే ఫోర్త్ సిటీకి పునాదులు పడ్డాయి. ఇదో వరల్డ్ క్లాస్ ఐడియా. ఎందుకంటే ఇప్పుడు హైదరాబాద్ లో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ పూర్తి ప్రణాళికాబద్ధంగా ఫ్యూచర్ సిటీని నిర్మించడం అంటే మాటలు కాదు. ఇది కేవలం సంకల్పబలంతోనే పూర్తవుతుంది. కొత్తగా ఏర్పాటవుతున్న నగరం కావడంతో పారిశ్రామిక, పర్యాటక, ఆతిథ్య రంగాలకు కీలక ప్రాధాన్యం ఇస్తామంటున్నారు. గ్రేటర్ పరిధిలో రోడ్డు, డ్రైనేజీ, ఫుట్పాత్ల వంటి విషయాల్లో ఇప్పటికే చాలా ఇబ్బందులు వస్తున్నాయి. ఓల్డ్ సిటీ, సహా విస్తరించిన మిగితా హైదరాబాద్ అలాగే కొత్తగా నిర్మితమైన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ సహా వెస్టన్ సిటీలో సమస్యలు తప్పట్లేదు. ఇక్కడ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా అప్పటికప్పుడు సమకాలీన అంశాలనే పరిగణనలోకి తీసుకోవడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే తాజాగా నిర్మించబోయే ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ రూపొందించి రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగ్గట్లు మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోబోతున్నారు. సో ఫోర్త్ సిటీతో హైదరాబాద్ ఖ్యాతిని అంతర్జాతీయంగా మరింత పెంచేలా రేవంత్ సర్కార్ తొలి ప్రయత్నంలోనే ప్రాధాన్యంగా తీసుకుంది.

**రూ. 1,580 కోట్లతో నాగ్పూర్ హైవేపై డబుల్ డెక్కర్ కారిడార్**

హైదరాబాద్ లో ట్రాఫిక్ సమస్యలను తొలగించేందుకు 2,232 కోట్లతో రాజీవ్ రహదారిపై ఎలివేటెడ్ కారిడార్, 1,580 కోట్లతో నాగ్పూర్ జాతీయ రహదారిపై డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాలకు సీఎం రేవంత్ ఇప్పటికే భూమిపూజ చేశారు. రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే మేడ్చల్, కుత్బుల్లాపూర్ అభివృద్ధి చెందడమే కాకుండా, కరీంనగర్, సిద్ధిపేట, ఆదిలాబాద్ ప్రయాణం సులభతరం అవబోతోంది. పనులు ఫాస్ట్ గా జరుగుతున్నాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ఈ ప్రాజెక్టు ఆలస్యమైందని సీఎం రేవంత్ ఇప్పటికే ఫైర్ అయ్యారు కూడా. రాజీవ్ రహదారిపై 11.12 కిలోమీటర్ల పొడవుతో 6 లైన్లతో భారీ ఎలివేటెడ్ కారిడార్ను నిర్మిస్తున్నారు. మొత్తం కారిడార్ పొడవు 18 కిలోమీటర్లు ఉండనుండగా.. ఎలివేటెడ్ కారిడార్ పొడవు 11.12 కిలోమీటర్లుగా ఉంది. ఇది పూర్తయితే %ూ==% వరకు ట్రాఫిక్ సిగ్నల్ లేకుండా వెళ్లొచ్చు.

**నాగ్ పూర్ హైవే నెం. 44 పై డబుల్ డెక్కర్ కారిడార్**

అటు నాగ్ పూర్ హైవే 44 పైనా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ కు సీఎం మార్చిలో శంకుస్థాపన చేశారు. ఇప్పటికే నాగ్పూర్లో వాహనాలు, మెట్రో రైలు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పై దూసుకుపోతున్నాయి. ఇక్కడ కూడా ఇదే తరహా నిర్మాణం వల్ల ఉత్తర తెలంగాణలోని 5 జిల్లాల ప్రజలు, వాహనదారుల ట్రాఫిక్ కష్టాలు తీరబోనున్నాయి. హైదరాబాద్, సికింద్రాబాద్తోపాటు మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ మీదుగా సాగే ఎన్హెచ్-44పైన జంట నగరాల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది.రక్షణశాఖ అనుమతులు తీసుకొచ్చి మరీ ఈ రోడ్ నిర్మాణం పూర్తి చేస్తున్నారు. అటు మెహిదీపట్నం వద్ద స్కైవాక్ నిర్మాణానికి రక్షణ శాఖ అనుమతి తెప్పించడం కూడా రేవంత్ ప్రభుత్వ విజయమే. ఎందుకంటే ఆ భూములను రక్షణశాఖ నుంచి అనుమతులు తీసుకుని పాదచారులు వెళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేయబోతున్నారు. సో ప్రజా అవసరాలే ప్రాధాన్యంగా ప్రతి నిర్ణయం తీసుకుంటూ వచ్చింది రేవంత్ ప్రభుత్వం.

**141 వాటర్ లాగింగ్ పాయింట్స్ కు శాశ్వత పరిష్కారం**

వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ లో మరింతగా సదుపాయాలు అవసరం. అందుకే రేవంత్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టాక హైదరాబాద్ లో మౌలిక సదుపాయాలపై ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా హైదరాబాద్ మెట్రో ఒక దశ వరకే ఆగిపోయిన సందర్భం. మిగితా నగరాలు హైదరాబాద్ ను దాటిపోయేలా విస్తరణ ప్రణాళికలు రెడీ చేసుకున్నాయి. మన దగ్గర మెట్రో విస్తరించకపోతే 9వ స్థానానికి పడిపోయే అవకాశం ఉండడంతో ఆ దిశగా సీఎం రేవంత్ రెడ్డి మొదటి అడుగు వేశారు. పెట్టుబడులకైనా, ఉద్యోగ అవకాశాలకైనా, ప్రజలకు మేలైన రవాణా సదుపాయాలు ఉంటే అన్నీ ఆటోమేటిక్ గా జరుగుతుంటాయి. ఇవి ఒక పారామీటర్. అందుకే మెట్రో నెట్ వర్క్ ను సీఎం ప్రాధాన్య అంశంగా తీసుకున్నారు. గత పది నెలల్లో పది సార్లు దీనిపైనే సీఎం రివ్యూ చేశారంటే ఇంపార్టెన్స్ ఎలా ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు.

**రెండో దశలో 6 కారిడార్లతో 116 కి.మీ. విస్తరణ**

24,237 కోట్ల రూపాయలతో మెట్రో రెండో దశ పనులకు క్యాబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపింది. రెండో దశలో 6 కారిడార్లతో 116 కిలోమీటర్లు విస్తరించబోతున్నారు. ప్రస్తుతం 5 కారిడార్లకు డీపీఆర్ రెడీ చేసి పంపించారు. 4 శాతం నిధులు పీపీపీ నుంచి సేకరించాలని కేంద్రం షరతు పెట్టినా నిధుల విషయంలో మాత్రం సీఎం రేవంత్ ?రెడ్డి పూర్తి స్పష్టతతో ఉన్నారు. ఇటీవలే హైదరాబాద్ మెట్రో 7 ఏళ్లు పూర్తి చేసుకుంది. ముంబయి, చెన్నైలో లక్షల కోట్లతో మెట్రో విస్తరిస్తున్నారు.అయితే మన దగ్గర గత ప్రభుత్వం పెద్దగా ఫోకస్ పెట్టలేకపోయింది. మిగితా నగరాలు మెట్రో విస్తరణలో దూసుకెళు న్నాయి. హైదరాబాద్ లో పనులు జరగకపోతే 9వ స్థానానికి పడిపోయే పరిస్థితి దగ్గర్లోనే ఉంది. అందుకే దీన్ని ఫస్ట్ టేకప్ చేస్తోంది రేవంత్ ప్రభుత్వం. 3 కారిడార్లు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు కలిపేలా రెండో దశ ప్రతిపాదన రూపొందించారు. ఎయిర్ ?పోర్టుకు ముందు 1.6 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ మెట్రో ఉండబోతోంది. ఓల్డ్ సిటీ మెట్రోకు ఇప్పటికే ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది కూడా.

**రూ. 596 కోట్లతో వరదనీటి కాల్వల ఆధునీకరణ**

ఇక హైదరాబాద్ చుట్టూ 18 వేల కోట్లతో ఆర్ఆర్ఆర్ నిర్మించనున్నారు. దీనికి ఎదురవుతున్న సవాళ్లను రేవంత్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసింది. భూసేకరణకు చిక్కులు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కేంద్రంతో సమన్వయం చేస్తూ ముందుకెళ్తున్నారు. ఇక హెచ్సిఐటిఐ ప్రాజెక్టులో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలో రోడ్ల నిర్మాణానికి 8,996 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు రెడీ చేశారు. అటు 596 కోట్ల అంచనాలతో వరదనీటి కాల్వలను, జంక్షన్లలో వర్షపు నీరు నిలవకుండా అండర్ గ్రౌండ్ వెల్స్ నిర్మిస్తున్నారు. మరోవైపు కేబీఆర్ పార్కు చుట్టూ 826 కోట్లతో ఆరు జంక్షన్లను అభివృద్ధి చేయబోతున్నారు.దీంతో అక్కడ ట్రాఫిక్ చిక్కులు పూర్తిగా తొలగిపోనున్నాయి. అటు 360 కోట్లతో మీరాలం చెరువు వద్ద 4 లేన్ల బ్రిడ్జి నిర్మిస్తున్నారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్సిటీ వస్తోంది. ఫార్మాసిటీతోపాటు ఏఐ సిటీ, సాఫ్ట్వేర్, లైఫ్సైన్సెస్, హెల్త్కేర్ టెక్నాలజీ వంటి పరిశ్రమల కేంద్రంగా ఉండబోతోంది. యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీకి ఇప్పటికే శంకుస్థాపన చేయగా త్వరలోనే స్పోర్ట్స్ యూనివర్శిటీనీ నెలకొల్పబోతున్నారు.

**కొత్తగా 39 ఎస్టీపీలను నిర్మాణానికి రెడీ**

హైదరాబాద్లో చెరువులు, నాలాలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు హైడ్రాను ఏర్పాటు చేశారు. ఈ తరహా వ్యవస్థ ఏర్పాటు చేయడం తెలంగాణ చరిత్రలో ఇదే తొలిసారి. దీంతో చాలా వరకు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. చెరువులను కబ్జాల చెర నుంచి విడిపిస్తున్నారు. అటు హైదరాబాద్ మధ్య నుంచి వెళ్తున్న మూసీనది పునరుజ్జీవంపై సీఎం రేవంత్ సీరియస్ ఫోకస్ పెట్టారు. 5 అంతర్జాతీయంగా పేరొందిన సంస్థలను కన్సార్టియంగా ఏర్పాటు చేసి డీపీఆర్ రెడీ చేయించే పనిలో ఉన్నారు.మూసీ పునరుజ్జీవంతోపాటు హిమాయత్సాగర్, ఉస్మాన్సాగర్లకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మూసీలోకి చేరుతున్న మురుగును శుభ్రం చేసేందుకు ఇప్పటికే ఉన్న ఎస్టీపీలకు తోడు కొత్తగా 39 ఎస్టీపీలను ఏర్పాటు చేయబోతున్నారు. ఎల్లంపల్లి నుంచి 20 టీఎంసీల నీటిని తరలించి హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చనున్నారు. బాపూఘాట్ను తీర్చిదిద్ది, గాంధీ ఐడియాలజీ కేంద్రాన్ని ఏర్పాటుకు ప్రణాళికలు రెడీ చేశారు.

**ఆర్ఆర్ఆర్ దాకా హెచ్ఎండీఏ పరిధిలోకి తెచ్చేలా ప్రణాళికలు**

ప్రపంచ నగరాలతో పోటీ పడుతున్న హైదరాబాద్ ను మరింతగా డెవలప్ చేసేందుకు భవిష్యత్ అవసరాల కోసం, పరిపాలన కోసం విస్తరించాలని సర్కార్ భావించింది. అందులో భాగంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. హెచ్ఎండీఏలో కొత్త జోన్లు ఏర్పాటు చేశారు. గతంలో నాలుగు జోన్లు ఉండగా.. ఇప్పుడు వాటి సంఖ్య 6కు చేరుకుంది. ప్రస్తుతం ఏడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న హెచ్ఎండీఏలో జోన్లను ఆరుకు పెంచారు. ఆగస్టులో ఉత్తర్వులు జారీ చేశారు కూడా. ప్రస్తుతం హెచ్ఎండీఏ ప్రాంతం 7,200 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉండగా.. త్వరలోనే ఆర్ఆర్ఆర్ మొత్తం హెచ్ఎండీఏ పరిధిలోకి తెచ్చేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. సో ఏడాదిలోనే హైదరాబాద్ పై ప్రభుత్వం ఈ స్థాయి ఫోకస్ పెడితేవచ్చే నాలుగేళ్లలో సిటీ దశ దిశ ఎలా మారుతాయో అర్థం చేసుకోవచ్చంటున్నారు.

# న్యూ ఇయర్ వేడుకలపై డ్రగ్స్ ముఠాల దృష్టి..



శేరిలింగంపల్లి: హైదరాబాద్ మహానగరాన్ని డ్రగ్స్ మాఫియా వదలడం లేదు. ఏదో ఒకరూపంలో సరఫరాదారులు తమ పని తాము చేసుకుపోతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వాటిని నగరానికి తీసుకొచ్చి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రాము మత్తు మందు ధర వేలల్లో పలు కుతుండడంతో తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించే ఛాన్స్ ఉందని ఈ బిజినెస్ ఊబిలోకి దిగుతున్నారు. పేద, ధనిక అనే తేడా లేకుండా డ్రగ్స్ కు బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చిన్న చిన్న శుభకార్యాలలోనూ ఏదో ఒక రకమైన డ్రగ్స్ తీసుకుని ఎంజాయ్ చేయడం ఇప్పుడు ఫ్యాషన్ గా మారింది. ఇక ఇయర్ ఎండ్ వస్తుందంటే చాలు మహానగరాన్ని మత్తులో ముంచెత్తడానికి డ్రగ్స్ ముఠాలు రెఢీ అయిపోతున్నాయి. ఈ మధ్యకాలంలో భారీగా పట్టుబడ్డ డ్రగ్స్ ముఠాలు ఇదే విషయాన్ని వెల్లడించాయి.

**పెరుగుతున్న డ్రగ్స్ కల్చర్..**

న్యూ ఇయర్ వేడుకలకు అంతా సిద్ధమైపోతుంది. ఎవరి ప్లాన్లు వారు చేసుకుంటున్నారు. ఎలా ఎంజాయ్ చేయాలి అన్నదానిపై ఎవరికి తోచిన విధంగా వారు ప్రణాళికలు రచించుకుంటున్నారు. అయితే సందట్లో సడేమియాలా యూత్ ను మత్తులో జోగేలా చేసేందుకు డ్రగ్స్ సరఫరాదారులు సైతం పక్కా ప్లాన్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ మధ్యకాలంలో నగరంలో ఏదో ఒకచోట తరచూ డ్రగ్స్ ముఠాలు పట్టుబడుతూనే ఉన్నాయి. వీరందరి టార్గెట్ న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ మీదనే.. ఇయర్ ఎండ్ పార్టీల మీద ఫోకస్ చేసిన విక్రయదారులు గోవా, కశ్మీర్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ తో పాటు ఆయా రాష్ట్రాల నుంచి డ్రగ్స్ ను నగరానికి తెప్పించడంలో ఫుల్ బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు నగర శివారుల్లోనూ లోకల్ మేడ్ గా తయారు చేస్తూ ఈ ఇయర్ ఎండ్ లో వీలైనంత ఎక్కువగా సప్లై చేసి కోట్లకు పడగెత్తాలని కొందరు అక్రమార్కులు ఈ బిజినెస్ లోకి దిగుతున్నారు. మత్తులో పడిన యూత్, విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

**అడ్డాగా హైదరాబాద్..**

ఇదివరకు చిన్నా చితకా గంజాయి కేసులు నమోదయ్యే హైదరాబాద్ లో ఇప్పుడు గంజాయి కంటే డ్రగ్స్ కేసులే ఎక్కువగా నమోదవుతున్నాయి. అలాగే ఒకప్పుడు డ్రగ్స్ పట్టుబడ్డాయి అంటే ఆఫ్రికన్ల అరెస్టులు ఉండేవి. ఇప్పుడు లోకల్ ముఠాలే డ్రగ్స్ తయారు చేస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. డ్రగ్స్ వినియోగంలో గోవా, ఢిల్లీ నగరాల తర్వాత... హైదరాబాద్ మూడో స్థానంలో ఉందంటే అతిశయోక్తి కాదు. ప్రతి చిన్న పార్టీలో కూడా డ్రగ్స్ వాడకం కామన్ గా మారింది. పబ్ లు, బార్లు, రిసార్టులు, ఫామ్ హౌస్ లో చాలాకాలంగా ఈదందా సాగుతుండగా ఈ మధ్య డ్రగ్స్ కల్చర్ అన్నిచోట్లకు పాకింది. బర్త్ డే వేడుకలు, న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ అంటే చాలు ఏదో ఒక రకమైన డ్రగ్స్ లేకపోతే నామోషీగా ఫీలవుతున్నారు కొందరు. అదేదో స్టేటస్ సింబల్ అన్నట్లు పోజ్ కొడుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే డ్రగ్స్ వాడకం అనేది ఇప్పుడు నయా ట్రెండ్ అంటున్నారు యూత్. ఆయా జిల్లాల్లో లభించే గంజాయితో పాటు కొకైన్, హెరాయిన్, చరాస్, ఎండీఎంఏ బ్లోట్స్, ఓపియం, ఎఫెడ్రోన్, ఎల్ఎస్ఏ స్ట్రిప్స్, ఎలీసా బ్లోట్స్ నగరానికి వస్తున్నట్లు సమాచారం.

**అందరికీ అందుబాటులో..**

గతంలో సంపన్నులకు మాత్రమే అందుబాటులో ఉండే ఈ మత్తు మందులు ఇప్పుడు సామాన్యుల చెంతకు కూడా చేరాయి. చివరికి స్కూలు విద్యార్థులకు సైతం మత్తుమందులు దొరుకుతున్నాయంటే ఈ డ్రగ్స్ ముఠాలు ఏస్థాయిలో తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ పోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. సినీ ఇండస్ట్రీని, ఐటీ ఎంప్లాయిస్ ను టార్గెట్ గా చేసుకుని రంగంలోకి దిగిన డ్రగ్స్ ముఠాలు.. సామాన్యులను సైతం తమ ఉచ్చులోకి లాగుతున్నాయి. వారికి ఏదో ఓరూపంలో అందిస్తూ విద్యార్థి దశ నుంచి డ్రగ్స్ కు దాసోహం అనేలా చేస్తున్నాయి. ఇదివరకు నైజీరియా, ఉగాండా లాంటి ఆఫ్రికా దేశాల నుంచి దిగుమతి అయ్యే అత్యంత ఖరీదైన మత్తుపదార్థాలు ఇప్పుడు లోకల్ గానే లభిస్తున్నాయి. గోవా, జమ్మూ కాశ్మీర్, పంజాబ్, ఒడిశా నుంచి ఖరీదైన డ్రగ్స్ హైదరాబాద్ వచ్చి చేరుతున్నాయి. వీటి సరఫరా కోసం పటిష్టమైన నెట్వర్క్ ను ఏర్పాటు చేసుకుంటున్నారు సరఫరాదారులు. ఎప్పటికప్పుడు పోలీసులకు దొరక్కుండా కొత్త కొత్త పద్ధతుల్లో ఈ డ్రగ్స్ దందాను కంటిన్యూ చేస్తున్నారు.

## విజయవాడలో సంగీత నీరాజనం

విజయవాడ, నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, కేంద్రమంత్రి, నటుడు సురేష్ గోపి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా సామజవరగమన సంగీతాన్ని కేంద్రమంత్రి సురేష్ గోపి పాడి వినిపించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న సంగీత రంగంలోని కళాకారులను ఒకసారి మననం చేసుకోవడానికి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. విజయవాడలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఎంతో గర్వకారణమని తెలిపారు. సంగీత నీరాజనం అంటే సంగీతానికి పునరంకితం అవ్వడమన్నారు. సంగీత నీరాజనం కార్యక్రమాన్ని తుమ్మలపల్లి కళాక్షేత్రంలోనే కాకుండా అమ్మవారి ఆలయం, దుర్గాఘాట్లోనూ నిర్వహిస్తున్నామన్నారు. పద్య నాటకం మనకు మాత్రమే సొంతమైన కల అని పేర్కొన్నారు. రాజమండ్రిలో దేవీ నవరాత్రుల సమయంలో పద్య నాటకాన్ని ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారన్నారు. తోలుబొమ్మలాట, జానపద కళారూపాలు ఎన్నో రాష్ట్రంలో ఉన్నయని.. వాటన్నిటినీ బతికించుకోవాలని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వంలోనే కళాకారులకు గుర్తింపు సాధ్యమన్నారు. సురేష్ గోపి అద్భుతమైన నటుడని.. అంతేకాకుండా ఆయన కేంద్ర మంత్రి కావడం మన అదృష్టమన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లాంటి వ్యక్తులు రాష్ట్రంలో ఉండబట్టే కళలు ఇంకా అంతరించిపోకుండా ఉన్నాయన్నారు. టూరిజానుని కూడా సమగ్రంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. కర్ణాటక సంగీతాన్ని కృష్ణవేణి సంగీత నీరాజనం ద్వారా ప్రజలకు తెలియపరచడం చాలా సంతోషంగా ఉందని కేంద్రమంత్రి, నటుడు సురేష్ గోపి అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కు అభినందనలు తెలియజేశారు. “విజయవాడకు రావడం నా సొంత ఇంటికి వచ్చినట్టు ఉంది. నన్ను ఒక కళాకారుడుగా, నటుడుగా ఆంధ్ర ప్రజలు ఎప్పుడు స్వాగతిస్తున్నారు. కర్ణాటక సంగీతాన్ని విజయవాడ నగర వాసులకు పరిచయం చేయడం చాలా సంతోషంగా ఉంది. అన్నమచార్య, త్యాగరాజు, రామదాసులాంటి వ్యక్తులు ఈ గడ్డమీద పుట్టారు. అహోబిలం, కేరళ, మైసూర్ కూడా సంగీత నీరాజనం లాంటి కార్యక్రమాలు ఎన్నో నిర్వహిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జానపద కళలకు, ఇండియన్ కల్చర్కు, సంస్కృతి సాంప్రదాయాలు పెద్దపీతం వేశారు” అని తెలిపారు. “సంగీత ప్రియులకు ఇది ఒక శుభ పరిణామం. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరగాలి. రాబోయే జనరేషన్స్కు కర్ణాటక సంగీతం గురించి నేర్చుకోవడం చాలా అవసరం. మైసూర్లో జరిగే సుగంధ సంగీత ఫెస్టివల్ కూడా ఎంతో వైభపేతంగా జరిగింది. ఈ మూడు రోజులు పాటు జరిగే కర్ణాటక సంగీతంలో పాడేవారికి, శ్రోతలకి అందరికీ మన హిస్టరీ వేల్యూస్ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది” అని కేంద్రమంత్రి వెల్లడించారు.

# పార్లమెంట్‌కి రూ.50,000 తీసుకెళ్లడం అసాధారణం కాదు..



న్యూఢిల్లీ, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీకి కేటాయించిన రాజ్యసభ సీటు వద్ద నుంచి రూ. 50,000 దొరకడం వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనపై సభ చైర్మన్ జగదీప్ ధంఖర్ విచారణకు ఆదేశించారు.అయితే, ఈ వివాదంపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ శుక్రవారం స్పందించారు. సభలోకి రూ. 50,000 నగదును తీసుకెళ్లడం అసాధారణం లేదా అనుమానాస్పదంగా లేదని ఆయన అన్నారు. బీజేపీకి చెందిన ఎంపీలు, ఇతర ఎంపీలు కూడా పార్లమెంట్‌కి ఇదే మొత్తాన్ని తీసుకెళ్లినట్లు అంగీకరించారు.మను సింఘ్వీ పేరును తీసుకురావడం తప్పు, సాయంత్రం 6 గంటల తర్వాత సభలో సోదాలు జరిగాయి, డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయి..? దర్యాప్తు చేస్తే విషయం స్పష్టంగా తెలుస్తుందని ఆయన అన్నారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) ఏర్పాటు చేయాలని, దర్యాప్తు నుంచి తాము తప్పించుకోవడం లేదని, ఇది ప్రభుత్వ కుట్రగా ఆయన అభివర్ణించారు.బీజేపీ ఎంపీలతో సహా 5-6 మందితో తాను అంతకుముందు రోజు మాట్లాడానని, వారు రూ. 50,000 చూపించారని జైరాం రమేష్ అన్నారు. ఎవరైనా జేబులో రూ. 50 వేలు ఉంటే అందులో ఆశ్చర్యం ఏమీ లేదని చెప్పారు. అయితే, ఈ ఆరోపణల్ని సింఘ్వీ తోసిపుచ్చారు. ఈ సంఘటన గురించి తనకు తెలియదని, పార్లమెంట్‌కి హాజరయ్యేటప్పుడు సాధారణంగా తాను రూ. 500 మాత్రమే తీసుకెళ్తానని చెప్పారు. దర్యాప్తు పూర్తికాకముందే సింఘ్వీ పేరును చైర్మన్ ధంఖర్ బయటపెట్టారని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు.

# సంక్రాంతికి సన్నబియ్యం ఇచ్చేనా?

హైదరాబాద్,తెలంగాణలో సన్నబియ్య ఆశలు సన్నగిల్లినట్టేనా? సంక్రాంతి నుంచి రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రకటించారు. కానీ ప్రకటనలకు అనుగుణంగా పని మాత్రం కావడం లేదని సమాచారం. సన్నబియ్యం పంపిణీకి పౌరసరఫరాలశాఖ కనీస చర్యలు కూడా ప్రారంభించలేదని తెలుస్తున్నది. మంత్రులు ఇచ్చిన హామీ ప్రకారం సన్న బియ్యం పంపిణీకి మరో నెల రోజుల సమయం మాత్రమే మిగిలి ఉంది. కానీ ఇప్పటివరకు సన్న బియ్యం అస్సలే సేకరించలేదు. మరో ఆరు నెలలకు అవసరమైన దొడ్డు బియ్యం సేకరణ కోసం అధికారులు మిల్లర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇప్పట్లో సన్న బియ్యం పంపిణీ లేనట్లేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. న్న బియ్యం పంపిణీపై ప్రభుత్వ పెద్దల ఆలోచన బెడిసికొట్టిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. సన్న ధాన్యానికి బోన స్ ఇస్తున్నందున అధిక విస్తీర్ణంలో సన్నాలు సాగవుతాయని, వాటి ద్వారా సన్న బియ్యం ఇవ్వొచ్చని ఆలోచించినట్టు తెలుస్తున్నది. ఇందుకు విరుద్ధంగా పౌరసరఫరాల సంస్థకు సన్నాలు రాకపోవడంపై అధికారుల్లో అంతర్మథనం మొదలైంది. వాస్తవానికి సన్న బి య్యం పంపిణీకి ఏటా 24లక్షల టన్నుల బి య్యం, 36లక్షల టన్నుల ధాన్యం



అవసరం. కానీ ఇప్పటివరకు సివిల్ సైప్లై సంస్థ 10 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది. ఇంకో 5లక్షల టన్నులు రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన మరో 20 లక్షల టన్నుల ధాన్యం తక్కువ పడుతున్నది. ఇంత భారీస్థాయిలో సన్న బియ్యాన్ని బయట కొనుగోలు చేసి పంపిణీ చేస్తే సివిల్ సైప్లైపై భారీ ఆర్థిక భారం పడుతుంది. ఈ నేపథ్యంలో రేషన్‌లో సన్న బియ్యం పంపిణీ వాయిదా వేసినట్టు తెలుస్తోంది.

# ఢిల్లీలో గాలిలో నాణ్యత కొద్దిగా బెటర్

న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత మెరుగుపడింది. ఇటీవలే రాజధాని ప్రాంతంలో గాలి కాలుష్యం తీవ్ర స్థాయికి చేరిన విషయం తెలిసిందే. ఒకానొక సమయంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా 500 మార్క్‌ను దాటింది. దీంతో కాలుష్య నియంత్రణకు గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్-4 నిబంధనలు విధించారు. ఈ నిబంధనలు కాస్త సత్ఫలితాలనిచ్చాయి. ప్రస్తుతం రాజధానిలో గాలి నాణ్యత చాలా వరకూ మెరుగుపడింది

శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో గాలి నాణ్యత మోడరేట్ కేటగిరీలో నమోదైంది. ఏక్యూఐ లెవల్స్ 183గా నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. చాందినీ చౌక్, ఐటీవో ప్రాంతాల్లో ఏక్యూఐ 183గా రికార్డైంది. ఓఖ్లా ఫేజ్-2లో 168, జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ప్రాంతంలో 159, పట్పర్గంజ్‌లో 195, ఆయా నగర్‌లో 115, లోధి రోడ్డులో 124, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ -3 వద్ద 137గా ఏక్యూఐ నమోదైంది. అదే సమయంలో కొన్ని ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో గాలి నాణ్యత పూర్ కేటగిరీలో నమోదైంది. ఆనంద్ విహార్‌లో 246, వాజీపూర్‌లో 208, ఆర్కేపురంలో 204, రోహిణిలో 217, పంజాబీ భాగ్‌లో 212, ముంద్కాలో 244తో పూర్ కేటగిరీలో ఏక్యూఐ నమోదైంది. గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉ



ంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.ప్రస్తుతం ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో వాయుకాలుష్యం మెరుగుపడటంతో ఆంక్షలు సడలించారు. కాలుష్యాన్ని అరికట్టేందుకు తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేటప్టింది. కాలుష్యం మెరుగుపడటంతో జీఆర్ఏపీ-4 ఆంక్షల సడలింపునకు అనుమతి ఇచ్చింది. సుప్రీం అనుమతితో రాజధానిలో శుక్రవారం నుంచి పాఠశాలలు తెరచుకున్నాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో పాఠశాలలను పునఃప్రారంభిస్తున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

# జనసేనలో 'బియ్యం' చిచ్చు!



అమరావతి, ఏపీ రాజకీయాలు కాకినాడ పోర్టు కేంద్రంగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం చుట్టే సాగుతున్నాయి. అంతేకాదు ఈ వ్యవహారం జనసేనలో చిచ్చు పెట్టినట్టు కనిపిస్తోంది. ఇద్దరు ముఖ్య నేతల మధ్య కోల్డ్‌వార్ నడుస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితిని టిడిపి నేతలు తమకనుకూలంగా మార్చుకుంటున్నట్లు ఇరుపార్టీల్లో జోరుగా చర్చ సాగుతోంది. కాగా కూటమిలోని రెండు పార్టీల మధ్య నెలకొన్న విభేదాలను కొన్నేళ్లుగా కాకినాడ పోర్టును తన స్వంత అడ్డాగా మార్చుకొని లక్షల టన్నుల ప్రజా పంపిణీ వ్యవస్థ -పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా విదేశాలకు రవాణా చేసిన వైసిపి నేత తాను కేసుల నుంచి బయట పడేందుకు చక్రం తిప్పుతు న్నట్లు సమాచారం. ఆ మూడు పార్టీలకు చెందిన కొందరి స్వార్థ, రాజకీయ ప్రయోజనాల మూలంగానే బియ్యం అక్రమ రవాణాపై సమగ్ర దర్యాప్తు, బియ్యం పట్టుబడిన స్టెల్లా నౌక సీజ్, కేసుల నమోదు, బాధ్యులపై చర్యలు చేపట్టట్లేదని ఆరోపణలొస్తున్నాయి. బియ్యం అక్రమ రవాణాను రాజకీయ విమర్శలకు ఉపయోగించడానికి, వీలైన మేరకు కేసులను తాత్సారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జూన్‌లో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కాకినాడ పోర్టు ద్వారా రేషన్ బియ్యం అక్రమ రవాణా అవుతోందంటూ సమీక్ష చేసి, కొద్ది మొత్తంలో బియ్యాన్ని పట్టుకొని, ఈ వ్యవహారంలో ఆలిండియా సర్వీస్ అధికారుల పాత్ర ఉందని ప్రకటిం చారు. అనంతరం కొన్ని మాసాల వరకు ఎలాంటి దర్యాప్తు లేదు. ఇటీవల నెల్లూరు పర్యటనలో ఉన్న డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌కు జనసేన పార్టీకి చెందిన కొందరు నాయకులు స్టెల్లా నౌక గురించి ఉప్పందించారు. ఆ నౌకను దాటించేస్తారన్న ఆలోచనతో హుటాహుటిన పవన్ కళ్యాణ్ కాకినాడ పోర్టుకు చేరుకొని నౌకలో అక్రమంగా తరలుతున్న బియ్యాన్ని సీజ్ చేయించేందుకు ప్రయత్నించారు. మామూలుగా అయితే తమ పార్టీకి చెందిన నాదెండ్ల మనోహర్ సివిల్ సప్లయిస్ శాఖ మంత్రిగా ఉన్నారు. ఆయన్ని అప్రమత్తం చేయకుండా పవన్ కళ్యాణే నేరుగా కాకినాడకు వెళ్లడంతో చర్చ మొదలైంది. నాదెండ్లపైనా, సివిల్ సప్లయిస్ అధికారులపై నమ్మకం లేకనే పవన్ నేరుగా రంగంలోకి దిగారనీ చెబుతున్నారు. నాదెండ్ల కావాలనే బియ్యం అక్రమ రవాణాపై సాచివేతగా ఉన్నారని అనుమానించడం వల్లనే పవన్ నేరుగా కార్యరంగంలోకి దిగారని సమాచారం. పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాలో కొందరు టిడిపి నేతల ప్రమేయం కూడా ఉందని, వారికి నాదెండ్ల పరోక్షంగా సహకరిస్తున్నారన్న అనుమానం పవన్‌లో ఉందని జనసేన పార్టీలో చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగా, వాటాలు కుదరకనే పవన్ కాకినాడకు వెళ్లారన్న ఆరోపణలు ఇటు జనసేనలో ఒక గ్రూపు నుంచి అటు టిడిపి నుంచి వస్తున్నాయి. మొత్తానికి బియ్యం అక్రమ రవాణా జనసేన ముఖ్య నేతల్లో తీవ్ర విభేదాలకు కారణమైందన్న వాదనలు బయలుదేరాయి. ÷ుడిఎస్ బియ్యం అక్రమ రవాణాకు కొందరు టిడిపి మంత్రుల అండదండలున్నాయని సమాచారం. తమ వారిని రక్షించుకునేందుకు జనసేన మంత్రుల మధ్య నెలకొన్న విభేదాలను వ్యూహాత్మకంగా ఉపయోగ పెట్టుకుంటున్నట్లు టిడిపి, జనసేన పార్టీల్లో చర్చించుకుంటున్నారు. అందుకే కేబినెట్ సబ్ కమిటీ సమీక్షలకే పరిమితమవుతోందని, ఇప్పటి వరకు ఎలాంటి నిర్దిష్ట చర్యలకు, దర్యాప్తునకు నిర్ణయాలు జరగలేదని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, కొన్నేళ్లుగా కాకినాడ పోర్టును నడిపిస్తున్న ఓ వైసిపి కీలక నేత, ఆయన కుటుంబం జనసేన, టిడిపి ఎత్తులను తమకనుకూలంగా మార్చుకుంటున్నారని సమాచారం. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసే రైస్ మిల్లర్ల, మాఫియా నెట్ వర్క్ చాలా మట్టుకు కూటమి కనుసన్నల్లోనే ఉందని, వాళ్లని వాళ్లు రక్షించుకునేందుకు ప్రయత్నిస్తారు కాబట్టి మధ్యలో తనకేం కాదని, తాను సులభంగా కేసుల నుంచి బయట పడవచ్చన్న ఆలోచనతో అందుకనుగుణంగా చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది.

# అప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం ఎందుకు పెట్టలేదు..



కామారెడ్డి జిల్లా: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 54000 ఉద్యోగాలు ఇచ్చారని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. గ్రూప్ పరీక్షల పేపర్ లిక్ కాకుండా తమ ప్రభుత్వంలో అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇవాళ(శుక్రవారం) మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ... కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి రూ.27 కోట్లు మంజూరు చేసినట్లు షబ్బీర్ అలీ తెలిపారు.మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులు రెచ్చ గొడుతున్నా ధాన్యానికి మద్దతు ధర ఉందని రైతులు ఎక్కడ కూడా ధర్నాకు దిగలేదని అన్నారు. "కవితా.. నీకు మీ నాన్నకు దోచుకోవడమే తెలుసు. తెలంగాణ రాగానే నీకు మీ అన్నకు , మీ కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయి" అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు సెక్రటేరియేట్ లో తెలంగాణ తల్లి విగ్రహం ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి రేవంత్ రెడ్డి గౌరవం ఇస్తూ విగ్రహాన్ని పెట్టిస్తున్నారని షబ్బీర్ అలీ తెలిపారు.

కేటీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడుతున్నారు: మహేష్ గౌడ్

హైదరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం పెడితే తెలంగాణ తల్లి అయింది. తాము పెడితే కాంగ్రెస్ తల్లి అవుతుందా అని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణకు మాజీ సీఎం కేసీఆర్ రావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల పండగను చేస్తోందన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న పండగలో ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పదేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలను తాము సంవత్సరంలో ఇచ్చామని అన్నారు. తెలంగాణలో నిర్బంధం లేని పాలన నడుస్తోందని మహేష్ గౌడ్ అన్నారు.మాజీ మంత్రి కేటీఆర్ పగటి కలలు కంటున్నారని విమర్శించారు. కేటీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పెట్రోల్ పోసుకొని అగ్గిపెట్టె దొరకలేదని నటించిన హరీష్ రావు ఏం త్యాగం చేశారని ప్రశ్నించారు. హరీష్ రావుపై చీటింగ్ కేసులు బుక్ అవుతున్నాయన్నారు. తక్కువ సమయంలో అత్యంత ఎక్కువ దోచుకుంది కేసీఆర్ కుటుంబమేనని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో నిర్బంధాలు లేవని చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడిన భాషపై కేసీఆర్ మందలించాలని మహేష్ గౌడ్ అన్నారు.

# చంద్రబాబుపై విజయసాయిరెడ్డికి పెద్ద ప్లాన్సే ఉన్నాయా..?

అమరావతి,తనపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేయడంపై వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. క్రిమినల్, లోఫర్, బ్రోకర్ అంటూ రెచ్చిపోయారు! సీఎం చంద్రబాబు, కేవీ రావు, నారా లోకేష్ లపై తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ తిరిగి అధికారంలోకి వస్తే చంద్రబాబు జైలు పాలవ్వడం తథ్యం అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.అవును... ఏపీ రాజకీయాల్లో ఇప్పుడు కాకినాడ పోర్టు వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. బియ్యం అక్రమ రవాణా, సీజ్ ది షిప్ దగ్గర మొదలైన వ్యవహారం ఇప్పుడు కాకినాడ పోర్టులో బెదిరించి షేర్లు తక్కువ రేటుకు రాయించుకున్నారంటూ సీఐడీకి ఫిర్యాదు చేసే వరకూ వెళ్లింది.ఇందులో భాగంగా... కాకినాడ పోర్టు యాజమాన్యాన్ని తమ బంధువులకు ఇప్పించుకునేందుకు విజయసాయిరెడ్డి తనను బెదిరించి షేర్లు తక్కువ రేట్లకు లాక్కున్నారంటూ మాజీ ఛైర్మన్ కేవీ రావు తాజాగా సీఐడీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన సీఐడీ సాయిరెడ్డిపై లుకౌట్ నోటీసులు కూడా జారీ చేసింది. దీనిపై సాయిరెడ్డి ఘాటుగా స్పందించారు.ఈ సందర్భంగా అసలు ప్రభుత్వ రంగంలోని పోర్టు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి ఎలా వెళ్లింది అంటూ.. పుట్టుపూర్వత్రాలు బయటకు తీసే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా... ప్రభుత్వ రంగంలోని పోర్టును చంద్రబాబు ప్రైవేటు పరం చేశారని.. మలేషియా ప్రధాని మహాతిర్ మహమ్మద్ తనయుడు కొంటున్నారంటూ అప్పట్లో చంద్రబాబు చెప్పుకొచ్చారని అన్నారు.చివరికి ఆ ముసుగులో కేవీ రావుకు కాకినాడ పోర్టు కట్టబెట్టారన్నారు. కేవీ రావుని దొడ్డిదారిన సీఎండీ స్థానంలో కూర్చోబెట్టారని వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని చంద్రబాబు జేబు సంస్థ సీఐడీ ద్వారా కాకుండా సీబీఐ ద్వారా దర్యాప్తు జరపాలని సాయిరెడ్డి డిమాండ్ చేశారు. జగన్ పై కక్ష తీర్చుకోవాలనే ఇలాంటి అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు.ఈ నేపథ్యంలోనే... స్కిల్ డెవలప్మెంట్ స్కామ్ కేసులో 58 రోజుల పాటు చంద్రబాబు జైల్లో ఉన్నారని.. ఆయన ఓ క్రిమినల్ అంటూ సాయిరెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. నిజంగా అన్యాయం జరిగితే నాలుగున్నరేళ్లుగా కేవీ రావు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.కేవీ రావు అనే వ్యక్తి చంద్రబాబు చెంచా అని.. సింగపూర్ లో ఉండి ప్రపంచవ్యాప్తంగా బ్రోకర్ పనులు చేసే వ్యక్తి అని తీవ్ర విమర్శలు గుప్పించారు. మరో నాలుగున్నరేళ్లు చంద్రబాబు అధికారంల్మో ఉంటాడని..తాము మళ్లీ అధికారంలోకి వస్తే చంద్రబాబు జైలు పాలవ్వడం తథ్యమని సాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.చంద్రబాబుకి పాలన చేతకాదని.. లోకేష్ కూడా అడ్మినిస్ట్రేటర్ కాదని.. పనికి రాని మంత్రి అని.. తండ్రీ కొడుకులు రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని నిప్పులు చెరిగారు. అసలు తనకు లుక్ ఔట్ నోటీసులు



ఇవ్వాల్సిన అవసరం ఏమిటని విజయసాయిరెడ్డి ప్రశ్నించారు.వాస్తవానికి గత ఎన్నికల్లో వైసీపీ 11 స్థానాలకే పరిమితం అయ్యే స్థాయిలో ఓటమి పాలవ్వడానికి గల కారణాల్లో చంద్రబాబుని అరెస్ట్ చేయడం ఒకటనే చర్చ బలంగా జరిగిన సంగతి తెలిసిందే. ఆ వయసులో చంద్రబాబుని సెంట్రల్ జైలుకి పంపడం వైసీపీ సర్కార్ చేసుకున్న రాజకీయ ఆత్మహత్యా ప్రయత్నం అనే విశ్లేషణలూ తెరపైకి వచ్చాయి.అయితే... తాము మళ్లీ అధికారం లోకి వస్తే చంద్రబాబును అరెస్ట్ చేయడం కన్ ఫాం అంటూ సాయిరెడ్డి వ్యాఖ్యానిం చడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే... గత ఎన్నికల్లో 11 ఎందుకు వచ్చాయో సాయిరెడ్డికి క్లారిటీ లేదా? అనే ప్రశ్నలు దర్శనమిస్తున్నాయి!

## పుత్తూరు నుంచి తమిళనాడులోని అత్తిపట్టు కొత్త రైల్వే మార్గం


తిరుపతి,పుత్తూరు నుంచి తమిళనాడులోని అత్తిపట్టు కొత్త రైల్వే మార్గం కోసం భూసేకరణ పనులకు రైల్వే శాఖ అనుమతిచ్చింది. 88 కిలోమీటర్ల దూరం కలిగిన ఈ రైల్వే లైనుకు 189 హెక్టార్ల భూములను సేకరించాల్సి వుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చెన్నై రైల్వేజోన్‌లో పుత్తూరు-అత్తిపట్టుతో పాటు 185 కిలోమీటర్ల దిండివనం-తిరువణ్ణామలై, 36కిలోమీటర్ల మోరంపూర్-ధర్మపురి,41 కిలోమీటర్ల మన్నార్‌గుడి-పట్టుకోటై, 52 కిలోమీటర్ల తంజావూరు- పట్టుకోటై లైన్ల భూసేకరణకు రైల్వే శాఖ అనుమతి ఇచ్చింది. చెన్నై హార్బర్‌లో ఎగుమతులు, దిగుమతుల వత్తిడి ఎక్కువ కావడంతో ప్రత్యామ్నాయంగా అత్తిపట్టు హార్బర్‌ను కేంద్రం ఎంపిక చేసింది. బళ్లారి నుంచి ఎగుమతయ్యే ఇనుప ఖనిజాన్ని భవిష్యత్తులో అత్తిపట్టు హార్బర్‌కు మళ్లిస్తారు. ఈ కొత్త రైల్వే మార్గం నారాయణవనం, పిచ్చాటూరు,నాగలాపురం మండలాల మీదుగా అత్తిపట్టుకు చేరుతుంది. ఈ కొత్త రైలు మార్గం రూపుదాల్చితే ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

# పార్లమెంట్‌లోకి ఎంపీలు.. నగదు తీసుకు వెళ్లేందుకు లిమిట్ ఉందా..?

న్యూఢిల్లీ,రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వీ సీటు వద్ద శుక్రవారం నోట్ల కట్ట లభ్యం కావడం కలకలం సృష్టించింది. దీనిపై రాజ్యసభ చైర్మన్ జగదీప్ దన్‌ఖడ్ దర్యాప్తునకు ఆదేశించారు. సభలో నోట్ల కట్ట లభ్యం కావడంతో.. అటు అధికార బీజేపీ, ఇటు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలకు చెందిన సభ్యుల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. అలాంటి వేళ.. సభలోకి సభ్యుడు తీసుకు వెళ్లేందుకు ఎంత వరకు నగదు అనుమతి ఇస్తారు. అందుకు సంబంధించిన నియమ నిబంధనలు ఏమైనా ఉన్నాయా? అనే ఓ ప్రశ్న ప్రస్తుతం ప్రతి ఒక్కరిలో ఉత్పన్నమవుతుంది.అయితే సభలోకి ఎంపీ ఎంత నగదుతో అయినా.. రావచ్చా అంటే.. పార్లమెంట్‌లో క్యాంటిన్లు, బ్యాంకులు సైతం ఉన్నాయి. చాలా మంది సభ్యులు ఈ బ్యాంకుల ద్వారా నగదు విత్ డ్రా చేసుకుంటూ ఉంటారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్లమెంట్ లోపలికి నగదు తీసుకు వెళ్లడం నిబంధనలకు ఏ మాత్రం విరుద్ధం కాదు. కానీ ఖర్చుల కోసం పరిమిత నగదును తీసుకు వెళ్లవచ్చుకానీ సభలో పెద్ద మొత్తంలో నగదు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ప్రదర్శించ కూడదు. ఎందుకంటే.. పార్లమెంట్ లోపల నగదు ఉపయోగించడం లేదా ప్రదర్శించడం.. దాని గౌరవాన్ని దెబ్బ తీస్తుంది. 2008 నుంచి ఈ నిబంధనలు పటిష్టంగా అమలు చేస్తున్నారు.

సభలోకి ఏం తీసుకు వెళ్లవచ్చు అంటే..?

సభలో సభ్యులు.. చిన్న పర్సు లేదా అవసరమైన వ్యక్తిగత వస్తువులతో కూడిన బ్యాగ్ తీసుకు వెళ్లేందుకు అనుమతించారు. మహిళా ఎంపీలు హ్యాండ్ బ్యాగ్‌లు సైతం తీసుకెళ్లవచ్చు. అది కూడా వ్యక్తిగత అవసరాలకు మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. -శాసనాలకు సంబంధించిన అవసరమైన పత్రాలు, నివేదికలు, బిల్లులు సభలోకి తీసుకెళ్ల వచ్చు.



డిబేట్ లేదా డిస్కషన్‌లో పాల్గొనేందుకు సిద్ధం చేసిన స్పీచ్ పేపర్ సైతం తీసుకు వెళ్లవచ్చు. -ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్ టాప్‌లు.. తమ వెంట తీసుకుని వెళ్లాలంటే.. ముందస్తు అనుమతి మాత్రం తప్పక తీసుకోవాల్సి ఉంటుంది. -సభలో ప్రొసీడింగ్ సమయంలో నీరు, తేలికపాటి స్నాక్స్ వంటివి తీసుకెళ్ల వచ్చు.

ఇవి నిషేధించబడ్డాయి..?

సభ లేదా సభా కార్యకలాపాలకు అవమానకరంగా భావించే ఏదైనా ఖచ్చితంగా నిషేధించబడింది.

నిరసనలో భాగంగా ఉపయోగించే ప్లకార్డులు, పోస్టర్లు, బ్యానర్లు వంటి వస్తువులను పార్లమెంటు లోపలికి తీసుకెళ్ల కూడదు.

నోట్ల కట్టలను.. ముఖ్యంగా పెద్ద మొత్తంలో సభలోకి తీసుకెళ్లడం ఖచ్చితంగా నిషేధించారు. -రికార్డింగ్ లేదా ఫోటోగ్రాఫ్ తీయడానికి ఉపయోగించే పరికరాలను అనుమతి లేకుండా సభలోకి తీసుకు వెళ్లకూడదు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com